# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 272 | హైదరాబాద్ | శుక్రవారం 24-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం: బ్యాంకులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు

## తెలంగాణ రాష్ట్ర పండుగగా
# వాసవీ మాత జయంతి.. ఉత్తర్వులు జారీ

- వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం
- ఏటా వైశాఖ శుక్ల దశమి నాడు అధికారికంగా ఉత్సవాలు
- ఈ ఏడాది ఏప్రిల్ 26న జయంతి వేడుకలు నిర్వహణ
- అన్ని జిల్లాల్లో వేడుకలు జరపాలని కలెక్టర్లకు ఆదేశాలు
- పర్యాటక, సాంస్కృతిక శాఖను నోడల్ ఏజెన్సీగా నియమించిన సర్కార్

11లో






## రేపటి నుంచే స్కూళ్లకు
11లో
# వేసవి సెలవులు

- సెలవులు ప్రకటిస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు
- ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు
- జూన్ 12న తిరిగి ప్రారంభంకానున్న పాఠశాలలు



## ఆర్టీసీ సమ్మె.. మంత్రుల కమిటీ వేసే యోచనలో ప్రభుత్వం
11లో



11లో

## తమిళనాడు, బెంగాల్‌లలో
# రికార్డు స్థాయిలో పోలింగ్!

- సాయంత్రం 5 గంటలకే తమిళనాడులో 82.24%, బెంగాల్‌లో 89.93% ఓటింగ్
- కన్యాకుమారిలో పడవల్లో డ్యామ్ దాటి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న గిరిజనులు
- 2021 ఎన్నికల నాటి పోలింగ్ శాతాన్ని అధిగమించిన రెండు రాష్ట్రాలు
- డీఎంకే కూటమి 200కు పైగా సీట్లు గెలుస్తుందని ఎండీఎంకే నేత వైగో ధీమా

11లో

## హర్మ్యూజ్ జలసంధిలో ఉద్రిక్తత
# 14 భారత నౌకలు సురక్షితం

- హర్మ్యూజ్ జలసంధి నుంచి 14 భారత నౌకలు సురక్షితంగా బయటపడ్డాయన్న కేంద్రం
- పర్షియన్ గల్ఫ్‌లో మరో 14 నౌకలు ఉన్నట్టు తెలిపిన విదేశాంగ శాఖ
- ముంద్రా పోర్టుకు వస్తున్న నౌకపై బుధవారం దాడి చేసిన ఇరాన్
- నౌకలపై దాడుల ఘటనపై ఇరాన్‌కు భారత్ తీవ్ర నిరసన
- గత శనివారం రెండు భారత నౌకలపై కాల్పులు జరిపిన ఇరాన్



11లో



## బెంగాల్ జోరు..
11లో
# మోదీ హుషారు!

- బెంగాల్‌లో నేడు 152 స్థానాల్లో తొలి దశ పోలింగ్
- రికార్డు స్థాయిలో పోటెత్తిన ఓటర్లు
- మే 4వ తేదీ బెంగాల్ లో మార్పునకు నాది అంటూ మోదీ హర్షం
- టీఎంసీకి వ్యతిరేకంగా మహిళలు, యువత పోరాటం ప్రారంభించారని వ్యాఖ్యలు

## చంద్రబాబు హెచ్చరిక
# 'శుభ దినాల్లోనూ తప్పుడు పనులే'

- రాంబిల్లిలో రూ.5,400 కోట్ల రెన్యూ ఎనర్జీ ప్లాంట్లకు భూమిపూజ
- అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా మారుస్తామన్న సీఎం
- విద్యుత్ ఛార్జీలు పెంచబోమని స్పష్టం చేసిన ప్రభుత్వం
- నాడు కూల్చివేతలు అంటూ గత ప్రభుత్వంపై విమర్శలు

11లో







## ఇక పెట్రో మంట ఉండదు
## కేంద్రం కీలక ప్రకటన

- ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల పెంపు లేదన్న కేంద్రం
- ధరల పెంపు వార్తలు అవాస్తవం, దురుద్దేశపూర్వకమని వెల్లడి
- గడిచిన నాలుగేళ్లుగా ధరలు పెంచని ఏకైక దేశం భారతేనని స్పష్టీకరణ
- అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నా భారత్‌లో స్థిరంగానే రేట్లు

11లో

భారత శక్తి

# రాజకీయ ప్రత్యర్థులుగా ఆడపడుచులు

సాధారణంగా రాజకీయ పార్టీలు వేర్వేరు మార్గాల్లో వెళుంటాయి. సిద్ధాంతాలతో పాటు భావజాలం వేరువేరుగా ఉంటుంది. అంతిమంగా ప్రజలకు మేలు చేయడమే కానీ.. వెళ్లే మార్గాలు వేర్వేరుగా ఉంటాయి. కానీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన విపక్షాలుగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి పార్టీలు ఒకే సారూప్యతతో ముందుకు వెళ్లడం విశేషం. చాలా అంశాల్లో ఆ రెండు పార్టీలు ఒకే విధానంతో ముందుకు వెళ్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఒకే రకమైన వ్యవహార శైలి.. ఒకే రకమైన భావజాలం రెండు పార్టీల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది.అలా జరుగుతుందా కేసీఆర్, జగన్ నేతలూ మూడో ఫ్రంట్ కడతారా. దేశ రాజకీయాల్లో కీలకమైన మలుపు తిప్పుతారా ఇవన్నీ ప్రశ్నలే. ఇంకా చెప్పాలీ అంటే ఊహాగానాలే కూడా. ఎందుకంటే ఈ ఇద్దరూ రాజకీయంగా మంచి స్నేహితులు అని ప్రచారంలో ఉన్నా ప్రస్తుతం ఇద్దరి రాజకీయాలూ కొంత ప్రతికూల వాతావరణంలో సాగుతున్నాయి. ఇద్దరూ మాజీ సీఎంలు అయ్యారు. ఇద్దరూ విపక్షంలోకి వచ్చేసారు. రెండు చోట్లా బలమైన ముఖ్యమంత్రులతో పోరాటం చేయాల్సి వస్తోంది. దానికి తోడు ఇద్దరి రాజకీయ ప్రత్యర్థులు వేరుగా ఉన్నారు. ఏపీలో టీడీపీతో జగన్ ఫైట్ చేస్తున్నారు. అవతల కాంగ్రెస్ తో కేసీఆర్ రాజకీయ యుద్ధం చేస్తున్నారు. అంతే కాదు జగన్ బీజేపీ పట్ల సాఫ్ట్ కార్నర్ తో ఉంటున్నారు. కేసీఆర్ కి తెలంగాణాలో బీజేపీ కూడా ఒక రాజకీయ ప్రత్యర్థి గానే ఉంది అన్నది రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు ఇదిలా ఉంటే కేంద్రంలోని బీజేపీ నాయకత్వం లో నడిచే ఎన్డీయే ప్రభుత్వం ఏ బిల్లు ప్రవేశపెట్టినా జగన్ పార్టీ వైసీపీ మద్దతు ఇస్తోంది. తాజాగా డీలిమిటేషన్ విషయంలో దక్షిణాది అంతా కూడా తమకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని గగ్గోలు పెడుతున్న వేళ జగన్ మద్దతు ఇచ్చారు. అక్కడితో ఆగకుండా ఆయన జాతీయ స్థాయిలో విపక్షాల తీరుని గట్టిగా విమర్శించారు. బీజేపీకి మద్దతుగా మాట్లాడారు. ఇదే మరింతగా న్యూట్రల్ రాజకీయ వర్గాలకు సైతం ఆగ్రహం కలిగేలా చేసింది అని అంటున్నారు. జగన్ బీజేపీకి సరెండర్ అయిపోయారు అంటూ కాంగ్రెస్ సహా ఇతర పార్టీల నుంచి విమర్శలు వచ్చిపడ్డాయి. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కి అత్యంత సన్నిహితుడు జగన్ వైసీపీని పెట్టిన తొలి నాళ్ళలో ఆయనతో కలిసి పనిచేసిన మాజీ ఎమ్మెల్యే సీనియర్ నాయకుడు గోనే ప్రకాశరావు అయితే జగన్ తీరుని పూర్తిగా తప్పుపట్టారు. జగన్ ఉంటే ఎన్డీయేలో ఉండాలి లేకపోతే ఇండియా కూటమిలో ఉండాలి. అటూ ఇటూ కాకుండా ఏమిటీ రాజకీయ వైఖరి అంటూ గోనె దుయ్యబెట్టారు. కాంగ్రెస్ కి మద్దతు ఇవ్వడం ఇష్టం లేకపోతే కేసీఆర్ తో కలసి జగన్ మూడో ఫ్రంట్ ఏర్పాటు చేసుకోవచ్చు కదా అని కీలక సలహా కూడా ఇచ్చారు. మీ ఇద్దరూ మిత్రులే కదా అని కూడా అన్నారు. ఈ విధంగా బయట ఉంటూ ఎన్డీయేకు మద్దతు ఇవ్వడమేంటని ఎకసెక్కమాడారు. స్టూడెంట్స్‌పై వేధింపుల ఆరోపణలు నిజమేగోనె ప్రకాశరావు ఇచ్చిన సలహా బాగానే ఉన్నా అది కుదిరే పనేనా అని అంటున్నారు. కేసీఆర్ సీఎం గా ఉన్నపుడు బీఆర్ఎస్ పేరుతో ప్రయోగాలు చేసిందే మూడో ఫ్రంట్ కోసం. కానీ అసలుకే ఎసరు వచ్చింది.. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ ఎప్పుడు ఫామ్ హౌస్ కే పరిమితం అవుతున్నారు. ఆయన ప్రజల్లోకి వచ్చింది చాలా తక్కువ. అలాగని అసెంబ్లీకి వెళ్ళరు. టైగర్ కు టైం వచ్చింది అంటూ పార్టీ శ్రేణులు గర్వంగా చెబుతుంటాయి. కానీ ఆయన ప్రజల్లోకి వచ్చింది లేదు. ఏపీలో జగన్మోహన్ రెడ్డి తీరు సైతం అలానే ఉంటుంది. ఆయన ప్యాలెస్ ల చుట్టూ తిరుగుతుంటారు. వారంలో నాలుగు రోజులపాటు బెంగళూరు ఎలాహంక ప్యాలెస్ లో ఉంటారు. మూడు రోజులు తాడేపల్లి ప్యాలెస్ లో గడుపుతారు. ఇప్పుడు హైదరాబాద్ ప్యాలెస్ కి వెళ్తానంటున్నారు. ఈయన సైతం అసెంబ్లీకి హాజరు కావడం లేదు. ప్రజల మధ్యకు వచ్చే సాహసం చేయడం లేదు. అయినా సరే వచ్చే ఎన్నికల్లో తమదే అధికారం అని ఈ ఇద్దరు నేతలు చెబుతున్నారు.ఎన్డీఏ ప్రభుత్వం విషయంలో సైతం వీరు సానుకూలంగానే ఉంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అయితే కెసిఆర్ ప్రధాని నరేంద్ర మోడీని టార్గెట్ చేసుకుంటూ మాట్లాడేవారు. వ్యక్తిగత విమర్శలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కానీ కేంద్రానికి చిన్న విమర్శ కూడా చేయడం లేదు. జగన్మోహన్ రెడ్డి తీరు గురించి చెప్పనవసరం లేదు. విమర్శలు చేయలేదు సరి కదా.. తిరిగి వ్యతిరేక కూటమికి మద్దతు తెలుపుతున్నారు. అప్పట్లో ప్రత్యేక హోదా విషయంలో చిన్నపాటి విమర్శలు కూడా చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి కూడా లేదు. రెండు పార్టీలకు ఆడపడుచుల బెడద తప్పడం లేదు. ఏపీలో సోదరుడు జగన్మోహన్ రెడ్డిని విభేదిస్తున్నారు షర్మిల. రాజకీయ ప్రత్యర్థులుగా మారిపోయారు. తెలంగాణలో సోదరుడు కేటీఆర్ తో పాటు తండ్రిని వ్యతిరేకిస్తున్నారు కవిత. ఘాటైన విమర్శలు చేస్తూ సొంత పార్టీ ఏర్పాటుకు సన్నాహాలు చేసుకుంటున్నారు కవిత. అయితే ఈ ఇద్దరు ఆడబిడ్డలకు సోదరుల కాలకేయ సోషల్ మీడియా సైన్యం చుక్కలు చూపిస్తోంది. మరోవైపు ఏపీలో జగన్మోహన్ రెడ్డి, తెలంగాణలో కేటీఆర్ పాదయాత్రలకు సిద్ధపడుతున్నారు. వారికి పోటీగా చెల్లెలు సైతం పాదయాత్ర దిశగా ఆలోచనలు చేస్తున్నారట. మరోవైపు జగన్మోహన్ రెడ్డి బయటకు వస్తే ఎలివేషన్లు మామూలుగా ఉండవు. చిన్నపిల్లల సీన్ క్రియేట్ చేస్తారు. జగన్ మామయ్య అంటూ గుక్క తిప్పి ఏడుస్తారు. అయితే ఈ ఎలివేషన్లు వెనుక ఐప్యాక్ హస్తం ఉంటుంది. అటువంటిదే ఇటీవల తెలంగాణలో కెసిఆర్ కూడా చేసి చూపించారు. జగిత్యాల సభకు వెళ్తున్న క్రమంలో ఓ తండ్రి చెంతనే ఉన్న పిల్లకు ఫ్లయింగ్ కిస్ ఇచ్చి ఆశ్చర్యపరిచారు. అదంతా ఎలివేషన్లలో భాగమేనని తెలుస్తోంది. ఇలా ఆ రెండు పార్టీల భావసారుప్యత ప్రతి దాంట్లోనూ కనిపిస్తోంది.ఇపుడు తెలంగాణాలో అధికారం దక్కించుకోవడమే కేసీఆర్ ప్రధాన లక్ష్యం. జగన్ విషయం చూస్తే ఆయన ఏపీ గడప దాటి బయట రాజకీయాలు చేసేందుకు అసలు ఇష్టపడరు. కేవలం ఆంధ్రాకే పరిమితం అవుతూ వస్తున్నారు. పైగా బీజేపీ పట్ల సానుకూలంగా ఉంటూ వస్తున్నారు. దానికి కారణం ఎవరికీ తెలియదు కానీ కాంగ్రెస్ వ్యతిరేకత అని అంటున్నారు. ఇక 2029 లో దేశంలో రెండే కూటములు పోటీ పడే సీన్ ఉంది. అవి ఎన్డీయే ఇండియా కూటములు. జగన్ కి ఇండియా కూటమి బహు దూరం. అందులో కాంగ్రెస్ ఉంది కాబట్టి చేరే ప్రసక్తి లేదు. అలాగని ఎన్డీయేలో చేరాలీ అంటే అందులో ఇప్పటికే చంద్రబాబు పవన్ ఉన్నారు. పైగా తనకు ఉన్న మైనారిటీ ఓట్లు పోతాయని జగన్ బాహాటంగా పొత్తు పెట్టుకోరు. అలాగని బీజేపీకి కాంగ్రెస్ కి సమ దూరం పాటించేది కూడా లేదని అంటున్నారు. మొత్తం మీద జాతీయ స్థాయిలో వైసీపీది ఒక నిలకడ లేని రాజకీయం అని ప్రత్యర్థులు విమర్శిస్తున్నా వైసీపీ అధినాయకత్వం మాత్రం తన రూటే సెపరేట్ అంటోంది. సో మూడో ఫ్రంట్ ముచ్చట అయితే జగన్ కేసీఆర్ లు చేసేది ఉండదనే అంటున్నారు. ఒకవేళ బీజేపీ ఓటమి చెంది కేంద్ర రాజకీయాల్లో మూడవ కూటమిగా ఎవరైనా ముందుకు వస్తే అందులో వైసీపీ కీలకంగా వ్యవహరించవచ్చు అని అంటున్నారు. అలాంటి కూటమికి కేసీఆర్ మద్దతు కూడా ఉండే చాన్స్ ఉందని అంటున్నారు.

# ఏపీ బీజేపీని లైట్ తీసుకుంటున్న అధిష్టానం ఆశలొద్దు.. పనిచేయండి


విజయవాడ, ఏప్రిల్ 23,

బీజేపీ ఏపీ నేతలకు ఇక పదవులు దక్కే అవకాశం లేదని పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ బీజేపీలో పదవుల కోసం ఆశావహులు చాలా మంది ఉన్నారు. కానీ ఇప్పటి వరకూ కూటమిలో ఉండటంతో వచ్చిన అవకాశాలను ఈ రాష్ట్ర నాయకులతోనే పదవులతో భర్తీ చేస్తుంది. కంభంపాటి హరిబాబుకు గవర్నర్ పదవి వచ్చింది. శ్రీనివాస వర్మకు కేంద్ర మంత్రి పదవి దక్కింది. రాష్ట్ర మంత్రివర్గంలో సత్యకుమార్ యాదవ్ ఉన్నారు. ఎమ్మెల్సీగా సోము వీర్రాజును ఎంపిక చేశారు. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా నర్సాపురం నేత వెంకట సత్యనారాయణను ఎంపిక చేసి అందరినీ ఆశ్చర్యంలోముంచెత్తించారు.ఇక రానున్న ఏ పదవుల్లోనూ బీజేపీ రాష్ట్ర నేతలకు అవకాశాలు లేవని చెబుతున్నారు. ఎమ్మెల్సీ పోస్టులు ఖాళీ అయినా దానిపై పెద్దగా కేంద్ర నాయకత్వం ఆసక్తి చూపడం లేదు. ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవి కోసం విష్ణు వర్ధన్ రెడ్డితో పాటు పలువురు నేతలు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. అయితే వచ్చే జూన్ నెలలో ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానాల్లో ఒక స్థానం బీజేపీకి లభించనుంది. అందులో తమిళనాడు నేత అన్నామలైకు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించినట్లు పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అన్నామలైను పెద్దల సభకు ఏపీ నుంచి పంపాలని యోచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ లో ఎంత మొత్తుకున్నా ఇక పార్టీ ఎదిగే పరిస్థితి లేదు. అయినా ఏపీ వల్ల రాజకీయంగా తమకు కలిగే నష్టం ప్రత్యేకంగా ఏమీ లేదన్న అభిప్రాయంలో కేంద్ర నాయకత్వం ఉన్నట్లు తెలిసింది. టీడీపీతో ఎటూ బీజేపీ పొత్తులో ఉంటుంది. ఒకవేళ వైసీపీ వచ్చినప్పటికీ తమకు కేంద్రంలో మద్దతు లభిస్తుంది. అందువల్ల మిగిలిన రాష్ట్రాల్లో బలం పెంచుకునే ప్రయత్నంలో కేంద్ర నాయకత్వం ఉన్నట్లు తెలిసింది. అందులో భాగంగానే ఇకపై పదవులను రాష్ట్ర నేతలను కాకుండా ఇతర ప్రాంత నేతలకు ఇచ్చే అవకాశాలున్నాయన్నది పార్టీ అత్యున్నత స్థాయి వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. రాజ్యసభ సభ్యుడిగా తెలంగాణకు చెందిన ఆర్. కృష్ణయ్యకు ఇచ్చారు. ఇప్పుడు మరోసారి తమిళనాడుకు చెందిన అన్నామలైకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరి ఏపీ బీజేపీ నేతలకు ఇది షాకింగ్ వార్త అనే చెప్పాలి.

# టీడీపీ, జనసేనల మౌనం ఎందుకో...

విజయవాడ, ఏప్రిల్ 23,

ఆంధ్రప్రదేశ్ లో కూటమి పార్టీల మధ్య ఎక్కడా సఖ్యత కనిపించడం లేదు. ఇది నిజంగా పార్టీ నాయకత్వానికి తెలిసీ మౌనంగా ఉంటుందా? లేకపోతే ఎన్నికల నాటికి సర్దుకుంటాయని భావిస్తుందో తెలియదు కాని రోజురోజుకూ మూడు పార్టీల మధ్య విభేదాలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. నేతల మధ్య సమన్వయం చేసే వారు లేరు. పార్టీ క్రమశిక్షణ కమిటీలు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో కూటమి నేతల పోరాటాలు వీధిపోరాటాలుగా మారాయి. అంతెందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహించే పిఠాపురం నియోజకవర్గంలోనే టీడీపీ, జనసేన నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉంది. రెండు పార్టీలూ కలవలేనంతగా విడిపోయాయి.రాష్ట్ర స్థాయిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల మధ్య మంచి అవగాహన ఉంది. ఇరువురూ ఒకరినొకరు సంప్రదించుకుంటూ ఎవరినీ నొప్పించకుండా నిర్ణయం తీసుకుంటున్నారు. కానీ పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేగా ఎన్నికయిన పిఠాపురం నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నకు మాత్రం ఎవరి వద్దా సమాధానం దొరకడం లేదు. ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో పెట్టకపోవడంపై మాజీ ఎమ్మెల్యే వర్మ మండిపడ్డారు. అధికారులపై ఆయన ఫైర్ అయ్యారు. జనసేన ఇన్ ఛార్జి పెండెం దొరబాబుతోనే ఒక్క పవన్ కల్యాణ్ ఫొటో మాత్రమే ఉంచడమేంటని ప్రశ్నించారు. మట్టి తోలుకునే వాడు వచ్చి ఇప్పుడు చెరువులు తవ్వేందుకు ప్రయత్నిస్తున్నాడని వర్మ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాము ఇక్కడ



పుట్టి పెరగామని, దత్తతకు రాలేదని అనడంతో జనసేన నేతలు మండిపడ్డారుఇటు టీడీపీ కాని, అటు జనసేన కానీ తమ పార్టీ నేతలను సముదాయించే ప్రయత్నాలు చేయకపోవడం, సంధి కుదర్చకపోవడం చూస్తుంటే ఏదో జరుగుతుందన్న అనుమానాలు కలుగుతున్నాయి. పిఠాపురంలోనే తాను మరోసారి పోటీ చేయాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అదే సమయంలో కూటమి పదిహేనేళ్ల పాటు కలసి ఉంటుందని చెబుతున్నప్పటికీ స్థానిక నాయకత్వాన్నిపిలిచి మాట్లాడలేకపోతున్నారు. మరొకవైపు చంద్రబాబు కూడా వర్మ అండ్ కోను కంట్రోల్ లో పెట్టకపోవడం చూస్తుంటే ఈ విభేదాలు ఇలాగే సాగిపోనీ.. తమకు వీరివల్ల నష్టం ఏమీ ఉండదన్న భరోసాలో ఉన్నట్లుంది. మొత్తం మీద పిఠాపురం నియోజకవర్గం వ్యవహారం మాత్రం పార్టీ నేతలకు ఎలా ఉన్నా... కూటమి అభిమానులకు మాత్రం కలవర పెడుతున్నాయి.

# వైసీపీలోకి వెంకట్రామరెడ్డి..

విజయవాడ, ఏప్రిల్ 23,

ఏపీలో ఒక విచిత్ర వాతావరణం నడిచింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించారు. కానీ చాలామంది చదువుకున్న వారు, ఉద్యోగాలు చేస్తున్నవారు ముందుగా జగన్మోహన్ రెడ్డికి మద్దతు చెబుతుంటారు. అయితే అది వారి వ్యక్తిగతం కానీ కొందరు ఉద్యోగులు బాహటంగానే నిబంధనలకు విరుద్ధంగా రాజకీయాలు చేస్తుంటారు. అటువంటి వారికి ఉద్యోగ సంఘం మాజీ నేత వెంకట్రామిరెడ్డి ఎపిసోడ్ చక్కటి ఉదాహరణ. ఆయనకి ఇంకా 15 సంవత్సరాల సర్వీస్ ఉంది. మంచి ఉద్యోగ జీవితం ఉండేది. కానీ దానిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పణంగా పెట్టారు వెంకట్రామిరెడ్డి. జగన్మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేయాలన్న కోణంలో ఉద్యోగ సంఘం నేత ముసుగులో ఆయన చేయని ప్రయత్నం లేదు. ఉద్యోగ నిబంధనల ప్రకారం ఆయన పై వేటు వేసింది కూటమి ప్రభుత్వం. ఉద్యోగిగా డిస్మిస్ అయిన ఆయనకు ప్రభుత్వం నుంచి ఎటువంటి బెనిఫిట్స్ దక్కవు. అయితే ఆయనకు జగన్మోహన్ రెడ్డి ఏ రూపంలో సాయం చేస్తారు అనేది ఇప్పుడు ప్రశ్న.గతంలో చాలామంది ఉద్యోగులతో పాటు అధికారులకు పదవులు ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి వారు తమ ఉద్యోగాలకు స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన తర్వాత పార్టీలోకి రప్పించి ఎంపీ తో పాటు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు. గెలిపించి చట్టసభలకు పంపించారు. ఇప్పుడు వెంకట్రామిరెడ్డి ని కూడా అలానే పొలిటికల్ గా ప్రోత్సహిస్తారా లేదా అనేది చూడాలి. కూటమి ప్రభుత్వం వెంకట్రామిరెడ్డి పై వేటు వేసినప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి విపరీతమైన సానుభూతి వచ్చింది.

# కారుమూరికి లిక్కర్ లింక్స్...

ఏలూరు, ఏప్రిల్ 23,

ఏపీ లిక్కర్ స్కామ్ డు మరో మాజీ మంత్రికి ఉచ్చు బిగుసుకుంటోంది. ఇప్పటికే సిట్ కారుమూరి ఇంటికి నోటీసులు అంటించగా..వాట్ నెక్స్ట్ అనేది ఉత్కంఠ రేపుతోంది.మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇప్పటికే పొలిటికల్‌గా యాక్టివ్‌గా లేరు. గత ఎన్నికల్లో ఓడినప్పటి నుంచి ఆయన క్యాడర్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది చాలన్నదట్లుగా లిక్కర్ స్కామ్ కేసు ఆయనకు కొత్త చిక్కులు తెచ్చి పెట్టేలా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని..అందులో కారుమూరి కుటుంబం కీలక పాత్ర పోషించిందనేది ప్రధాన ఆరోపణ. కారుమూరి కుమారుడు సునీల్, కోడలు కీర్తి అకౌంట్ల నుంచి కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారట.అయితే ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు కారుమూరి వేసిన ఎత్తుగడ ఇప్పుడు ఆయన మెడకే చుట్టుకుందన్న ప్రచారం నడుస్తోంది. సిట్ విచారణాధికారికి ఏకంగా లంచం ఇచ్చేందుకు ప్రయత్నించి, కేసు నమోదయ్యేలా చేసుకున్నారన్న టాక్ వినిపిస్తోంది. అధికారులనే కొనేయొచ్చనే అతి విశ్వాసం ఇప్పుడు కారుమూరిని చిక్కుల్లో పడేసిందన్న చర్చ జరుగుతోంది.వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో లిక్కర్ రవాణా కాంట్రాక్టు, టెండర్లలో అక్రమాలపై కారుమూరి, ఆయన కుమారుడు సునీల్‌కు సిట్ నోటీసులు ఇచ్చింది. విజయవాడ కమిషనర్ ఆఫీస్‌లోని సిట్ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని నివాసంలో వారు లేకపోవడంతో అధికారులు ఆ ఇంటి గోడకు నోటీసులు అంటించారు. మద్యం రవాణా చేసే కాంట్రాక్టులో రూ.200 కోట్ల నుంచి 400 కోట్ల వరకు దోచుకున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సీఐడీ గత నెలలో కేసు నమోదు చేసింది. అయితే జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న కారుమూరి పేరు లిక్కర్ స్కామ్ కేసులో తెరమీదకు రావడంతో..వైసీపీలో ఆందోళన కనిపిస్తోంది. అటు తణుకు వైసీపీ క్యాడర్ ఇదే సమయమని కారుమూరిపై ఉన్న అనంతృప్తిని బయటపెడుతున్నారట.ఒకప్పుడు తణుకు నియోజకవర్గంలో కారుమూరి మాటే శాసనం. కానీ 2024 ఎన్నికల ఫలితాల తర్వాత సీన్ రివర్స్ అయింది. ఓటమి తర్వాత ఆయన నియోజకవర్గానికి దాదాపు దూరమయ్యారు. ప్రజల సమస్యల సంగతి దేవుడెరుగు..కనీసం క్యాడర్‌కు కూడా ఆయన అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో పార్టీని




కాపాడుకోవాల్సింది పోయి, తాను కేసుల నుంచి ఎలా బయటపడాలన్నదానిపైనే కారుమూరి ఫోకస్ పెట్టారని క్యాడర్ రగిలిపోతోందట.అధికారంలో ఉన్నప్పుడు తన అనుచరులకే ప్రాధాన్యం ఇచ్చారని, కష్టపడ్డ కార్యకర్తలను పట్టించుకోలేదని ఇప్పుడు క్యాడర్ మండిపడుతోంది. ఆయనపై వస్తున్న అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పలేక పార్టీ నేతలు డిఫెన్స్‌లో పడ్డారని ఇన్‌సైడ్ టాక్. మరోవైపు అధికార కూటమి నేతలు ఈ అవకాశాన్ని అస్సలు వదులుకోవడం లేదు. ఇసుక, మద్యం అక్రమాలు అంటూ కారుమూరి టార్గెట్‌లో సోషల్ మీడియా పోస్టులతో హోరెత్తిస్తున్నారు.

# పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23,

ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తు వేర నిర్మించేందుకు సమ్మతి తెలిపింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) తొలిసారిగా స్పష్టమైన ప్రకటన చేసింది. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు గత నెల 25న ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు పీపీఏ వెబ్ సైట్ లో పోలవరం ఎత్తు కేవలం 41.15 మీటర్లుగానే చూపేవారు. 115 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు ఆ వెబ్ సైట్ లో ఉండేది అయితే తాజాగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ వెబ్ సైట్ లో ప్రాజెక్టు వివరాల్లో పూర్తిగా మార్పులు చేశారు. ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లుగా చూపడమే కాకుండా, గరిష్ట నిల్వ 194.60 టీఎంసీలుగా పేర్కొన్నారు. దీంతో పోలవరం ప్రాజెక్టు రెండో దశ చేపట్టేందుకు కేంద్రం సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం 41.15 మీటర్ల ఎత్తు ఉన్న ప్రాజెక్టును 45.72 మీటర్లకు పెంచాలంటే కేంద్రం తరఫున పలు కార్యక్రమాలు చేయాల్సివుంటుందని చెబుతున్నారు. కేంద్ర అటవీ పర్యావరణ అనుమతులు, స్టాప్ వర్క్ ఆర్డర్ ఎత్తివేత వంటి చర్యలు తీసుకోవాల్సివుంటుందని చెబుతున్నారు. గరిష్ట కాంటూరు 45.72 మీటర్లు ఎత్తు పెంచితే ప్రాజెక్టు రూపురేఖలు మారిపోనున్నాయని అంటున్నారు. ప్రస్తుతం పోలవరం మొదటి దశ పనులు చివరికి చేరుకున్నాయని అంటున్నారు. వచ్చే ఏడాది జూన్ లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ముందుగానే ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో కేంద్రం రెండో దశ పనుల విస్తరణపై దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. కాగా, 45.72 మీటర్ల ఎత్తుతో 194.6 టీఎంసీల చొప్పున రెండు దఫాలుగా నీటిని నిల్వ చేసుకోవచ్చునని అంటున్నారు. అంటే ప్రాజెక్టు ద్వారా మొత్తం 389.2 టీఎంసీల నీరు రాష్ట్ర అవసరాలు తీర్చేందుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.గరిష్ట కాంటూరు కూడా పూర్తయితే గోదావరి డెల్టాలో మొత్తం 10.13 లక్షల ఎకరాలు, 13 లక్షల కృష్ణా డెల్టాకు పుష్కలంగా సాగునీరు అందుతుందని అంచనా వేస్తున్నారు. అదేవిధంగా కృష్ణా బేసిన్ లో 80 టీఎంసీలు నీటిని సరఫరా చేస్తారని, ఇందులో 23.44 టీఎంసీలు పారిశ్రామిక అవసరాలు తీర్చేందుకు ఉపయోగపడతాయని చెబుతున్నారు. అదేవిధంగా మొత్తం 28.5



లక్షల మందికి సాగునీటి సమస్య తీరుతుందని, 960 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని చెబుతున్నారు. ఇక పోలవరం ప్రాజెక్టు రెండో దశకు ప్రభుత్వం సిద్ధమైతే భూ సేకరణకు భారీగా వెచ్చించాల్సివుంటుందని అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ప్రధాన కట్టడాల్లో ఎలాంటి మార్పు ఉండదని, కానీ, నిర్వాసితులకు పరిహారం, సహాయ పునరావాసాల కోసం రూ.28,561 కోట్లు అవసరం అవుతాయని లెక్క గడుతున్నారు. రెండో దశకు 80 వేల ఎకరాలు సేకరించాల్సివుంటుందని, మొత్తం 8 రెవెన్యూ మండలాల్లో 222 రెవెన్యూ గ్రామాలు ముంపునకు గురవుతాయని చెబుతున్నారు.

==================

# పిఠాపురం ఎపిసోడ్ లో కొత్త ట్విస్టులు...రంగంలోకి దొరబాబు..

కాకినాడ, ఏప్రిల్ 23,


ఏపీలో కూటమిలో భాగంగా పవన్ కల్యాణ్ కోసం సీటు త్యాగం చేసిన నేతగా పేరు తెచ్చుకున్న ఆయన..అప్పుడప్పుడు న్యూస్ ఇంట్రెస్టింగ్ సీన్స్‌కు తెరలేపుతున్నారట. జనసేనాని కోసం టికెట్ వదులుకోవడం వల్ల ఆయనకు ఓ రేంజ్‌లో ఎలివేషన్ వచ్చినా..ఆ తర్వాత పొలిటికల్ మైలేజ్ మాత్రం జీరో అన్నట్లు అయిపోందట. ఎమ్మెల్సీ అని..నామినేటెడ్ పోస్ట్ అని.. ఇలా ఎన్నో లీక్స్ వచ్చినా..ఇప్పటివరకు ఆయనకు ఏ పదవి దక్కలేదు. దీంతో అప్పుడప్పుడు ఆయనలోని అసంతృప్తిని క్యామియో రోల్‌లో చూపిస్తున్నారట.నిజానికి వర్మకు ఎలాంటి ప్రోటోకాల్ లేదు. పిఠాపురంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటున్నారు. అక్కడే ఏదో ఒక టాపిక్‌ను ఎత్తుకుని..ఇదేం పద్ధతి అంటూ అధికారులపై ఫైర్ అవుతున్నారు. ఇప్పటికే ఓసారి ఫ్లెక్సీలో చంద్రబాబు ఫోటోను చిన్నగా వేశారని అధికారులపై ఆయన సీరియస్ అవడం పొలిటికల్ హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు మరోసారి పిఠాపురం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఫ్లెక్సీలో సీఎం ఫోటో లేదంటూ రాద్ధాంతం చేశారు.అయితే ఇప్పటికి రెండుసార్లు సీఎం చంద్రబాబు ఫోటో కోసమే వర్మ గళం వినిపిస్తున్నట్లు పైకి ప్రచారం జరుగుతున్నా ఆయన మాటల వెనుక మర్మమేంటన్నది ఎవరికి అంతుచిక్కట్లేదట. సీటు త్యాగం చేసినా..తనకు ఏ పదవి రాలేదనే ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న వర్మ..తన అసంతృప్తిని మరో రూపంలో బయటపెడుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కక్కలేక మింగలేక అన్నట్లుగా తన ఆవేదనను నిరసనగా మార్చేస్తున్నారన్న టాక్ నడుస్తోంది.ఇక వర్మ బాధ ఒకటి అయితే..జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కథ మరోలా ఉందట. 2004లోనే ఆయన ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే. ఆ తర్వాత 2019లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పట్లో జగన్ దగ్గర ఆయన మాట బాగా చెల్లుబాటయ్యేదన్న టాక్ ఉంది. ఆ తర్వాత 2019లో వంగా గీతకు వైసీపీకి టికెట్ ఇవ్వగా.. ఆమె గెలుపు కోసం పనిచేసినా విజయం దక్కలేదు. 2024 ఆగస్ట్‌లో పెండెం దొరబాబు జనసేనలో చేరిపోయారు. ఆయన కూడా టూ టైమ్స్ ఎమ్మెల్యే, పైగా సీనియర్ లీడర్..ఈ నేపథ్యంలో తనకు కూడా ఏ పదవి లేకపోవడం ఆయన మదిని తొలిచేస్తుందట. అందుకే వర్మకేనా ఎలివేషన్..పిఠాపురంలో తాను కూడా ఉన్నానంటూ ఇది దొరబాబు సవాల్ అంటూ రెచ్చిపోతున్నారట. ఈ క్రమంలోనే ఏకంగా వర్మను టార్గెట్ చేసి పవన్ మదిలో చోటు కోసం ఆరాట పడుతున్నారటదొరబాబు పిఠాపురంలో వైసీపీ కోవర్టు అని వర్మ అంటుంటే..వర్మ చీకటి బాగోతాలు అంటూ దొరబాబు రచ్చకు తెరలేపారట. అయితే ఈ ఇద్దరిది సీరియస్ ఫైట్ కాదని..ఏదో ఒక బెర్త్ కోసమే రచ్చ చేస్తున్నారని పిఠాపురం పబ్లిక్‌లో చర్చ జరుగుతోందట. వర్మ త్యాగానికి ఏదో ఒక పదవి దక్కితే బాగుండనే చర్చ అందరిలో ఉన్నా..దొరబాబు ఎపిసోడ్‌పై జనంలో డిఫరెంట్ ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయట.రాజకీయ నాయకులు ఏదీ డైరెక్ట్ గా చెప్పరు. తన మీద ఒక్క అవినీతి అక్రమాల ఆరోపణలు రుజువు చేసినా రాజకీయ సన్యాసం స్వీకరిస్తాను అని దొరబాబు మీడియా ఎదుట సవాల్ చేశారు. తన మీద ఆరోపణలు చేసిన వారు నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు. పిఠాపురంలో ఒక్క విషయంలో కూడా తాను అవినీతి చేయలేదని ఆయన అన్నారు. తనది మచ్చ లేని జీవితం అన్నారు. తాను నిజానికి రాజకీయాల నుంచి తప్పుకోవాలనే అనుకున్నానని అయితే పవన్ కళ్యాణ్ మీద అభిమానంతో జనసేనలో చేరాను అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనను మంచి మెజారిటీతో గెలిపిస్తామని ఆయన చెప్పారు. అంతే కాదు వర్మ అండ్ కో చేస్తున్న ఆరోపణల మీద తాను పూర్తి వివరణ ఇస్తాను అని అదే విధంగా వారి విషయంలో కూడా పూర్తి గుట్టు విప్పుతాను అని స్పష్టం చేశారు. అయితే ఒకే పార్టీలో ఉంటూ ఒకరి గుట్టు మరొకరు విప్పుకుంటామని చెప్పడంతో కూటమిలో అలజడి రేగుతోంది. వర్మ అయితే దొరబాబు స్కాములను బయట పెడతామని అంటున్నారు. ఆయనకు జనసేనతో సంబంధం లేదని కేవలం తాను చేసిన అవినీతిని కప్పుపుచ్చుకోవడానికే ఆ పార్టీలో చేరారు అని వర్మ విమర్శించారు. అదే విధంగా వర్మ గుట్టు తన దగ్గర ఉందని దొరబాబు అంటున్నారు. ఇలా ఇద్దరూ మీడియాకు ఎక్కడంతో పార్టీ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. ఈ విధంగా కీలక నేతలు మాజీ ఎమ్మెల్యేలు వీధిన పడితే పోయేది కూటమి పరువే అని అంటున్నారు.పొలిటికల్ లీడర్ల మాటల వెనుక మర్మం వేరులే అన్న ఒపీనియన్ ఉండనే ఉంది. ఇప్పుడు ఈ ఇద్దరి నేతల విమర్శలు, ప్రతి విమర్శల వెనుక పకడ్బందీ స్కెచ్ ఉందట. బాబు మదిలో చోటును పదిలం చేసుకునే ప్రయత్నంలో వర్మ..జనసేనాని మెప్పుకోసం దొరబాబు..రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్నారట. ఇలా ఆ ఇద్దరి అసంతృప్తికి, ఆవేదనకు కారణం వేరైనా..కంటెంట్ మాత్రం బాగుందన్న డిస్కషన్ నడుస్తోంది.

========================

# విజయనగరం జిల్లాపై ప్లాన్..

విజయనగరం, ఏప్రిల్ 23, (

: ఏపీలో మరోసారి అధికారంలోకి వస్తామని భావిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అధికార కూటమికి గట్టి సవాల్ విసురుతూనే ఉంది. దానికి కారణం బలమైన జిల్లాలు ఆ పార్టీ నేతలకు పట్టుకొమ్మలుగా నిలుస్తూ వచ్చాయి. వచ్చే ఎన్నికల్లో ఆ జిల్లాల్లో ఏకపక్షంగా సీట్లు గెలవడం ద్వారా అధికారంలోకి రావచ్చు అనేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన. అయితే దానికి విరుగుడు సీఎం చంద్రబాబుతో పాటు లోకేష్ కనిపెట్టారు. ఎక్కడెక్కడ అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉందో ఆ జిల్లాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఏదో దూకుడుగా రాజకీయాలు చేయడం కాదు.. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును అమాంతం పెంచాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది. మొన్నటి టిడిపి కార్యవర్గాల ప్రకటన వెనుక ఈ వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయనగరం లాంటి జిల్లాల విషయంలో చంద్రబాబు ఆలోచన ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. పక్కా ప్రణాళిక అన్నట్టు పరిస్థితి ఉంది. గత కొంతకాలంగా విజయనగరం జిల్లాను గమనిస్తున్న లోకేష్ మార్కు కనిపిస్తోంది ఈ కూర్పులో.కుల రాజకీయాలను అడ్డం పెట్టుకుని బొత్స రాణించారు విజయనగరం జిల్లాలో కాంగ్రెస్ పార్టీతో పాటు వైసీపీలో తనకంటూ ఒక క్రియాశీలక పాత్ర పోషించి జిల్లాను శాసించారు. తన కుటుంబాన్ని వెూహరించి జిల్లాను గుత్తాధిపత్యం లో ఉంచుకున్నారు. వ్యవస్థల్లో సైతం తన మనుషులను ఏర్పాటు చేసుకున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న.. ఏ ప్రభుత్వం ఉన్నా తన మాట చెల్లుబాటు అయ్యేలా చేసుకున్నారు. అయితే దీనిని గ్రహించారు చంద్రబాబు. కానీ అశోక్ గజపతిరాజు లాంటి సౌమ్యుడుతో రాజకీయాలు చేసి బొత్సకు చెక్ పెట్టారు కానీ.. ఆయన మూలాలను దెబ్బతీయ లేక పోయారు. అయితే ఇప్పుడు అశోక్ గజపతి రాజును గవర్నర్ లాంటి రాజ్యాంగబద్ధ పదవిలోకి పంపించి.. ఆయనను ఎంతగానో గౌరవం ఇచ్చారు. కుమార్తె అదితి గజపతిరాజుకు ఎమ్మెల్యే పదవి ఇచ్చి రాజకీయ లోటును కూడా తీర్చారు. ఇప్పుడు బొత్స పై అసలు సిసలు రాజకీయం మొదలుపెట్టారు చంద్రబాబు, నారా లోకేష్.మొన్నటి ఎన్నికల్లో క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకున్నారు అశోక్ గజపతిరాజు. గత నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ జిల్లా బాధ్యతలను ఆయనే చూసేవారు. అయితే జిల్లా కోసం తన సొంత ఆస్తులను సైతం వదులుకున్నారు. అయినా సరే అక్కడ కుల సమీకరణలతో



బొత్స తన ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. సంప్రదాయ రాజకీయాన్ని నమ్ముకున్న అశోక్ గజపతిరాజు అదే రీతిలో ముందుకు సాగారు. కానీ జిల్లాలో ప్రాబల్య సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బొత్స మాత్రం క్షేత్రస్థాయిలో తన పట్టును పెంచుకున్నారు. ఎప్పుడైతే అశోక్ గజపతిరాజు పక్కకు వెళ్లారో .. అప్పటినుంచి చంద్రబాబు మార్పు రాజకీయం ప్రారంభం అయింది. ముల్లును ముల్లుతోనే తీయాలి అన్న కోణంలో బొత్సకు అదే సామాజిక వర్గంతో చెక్ పెట్టడం ప్రారంభించారు. తూర్పు కాపు సామాజిక వర్గానికి ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. పార్టీ కార్యవర్గాలలో తూర్పు కాపుల ప్రాతినిధ్యం పెంచారు. బొత్సకు ధీటుగా ఒక సైన్యాన్ని తయారు చేసే పనిలో పడ్డారు.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే యువనేత కిమిడి నాగార్జునను పిలిపించుకున్నారు చంద్రబాబు, లోకేష్. బొత్స హవా కు బ్రేక్ వేయాలంటే దూకుడుగా వ్యవహరించాల్సిందేనంటూ తేల్చి చెప్పారు. అది మొదలు నాగార్జున గట్టిగానే బొత్స అండ్ కోకు సమాధానాలు చెబుతున్నారు. మరోవైపు యువనేత కొండపల్లి శ్రీనివాస్ కు మంత్రి పదవి ఇచ్చారు. మరింత దూకుడు పెంచాలని ఆదేశించారు. తాజాగా తెలుగుదేశంలో విధానపరమైన నిర్ణయాల్లో అత్యున్నతంగా భావించే పొలిట్ బ్యూరోలో తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన గంటెడ శ్రీదేవికి చాన్స్ ఇచ్చారు. మరోవైపు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ను ప్రయోగిస్తున్నారు. కళా వెంకట్రావు సీనియర్ రెడ్డిని ఉపయోగించుకుంటున్నారు. ఆయన కుమారుడు రామ్ మల్లిక్ నాయుడును సైతం రంగంలోకి దించారు. ఈ పరిస్థితులన్నీ చూస్తుంటే మాత్రం బొత్స ఫ్యామిలీకి దీటుగా ఒక సైన్యాన్ని తయారు చేస్తున్నారు చంద్రబాబు, లోకేష్. అయితే వీరి ధాటికి బొత్స ఫ్యామిలీ తోక ముడియక తప్పదు అని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తమిళ పాలిటిక్స్ లోకి రోజా

చెన్నై, ఏప్రిల్ 243

తమిళనాడు ఎన్నికలు పతాక స్థాయికి చేరాయి. ప్రచార పర్వం ముగిసింది. తెలుగు నేతల తాకిడి ఎక్కువగా ఉంది. టిడిపి అధినేత చంద్రబాబు తో పాటు ఆ పార్టీ నేతలు ఎన్డీఏ కూటమికి మద్దతుగా ప్రచారం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్



పార్టీ నుంచి మాజీమంత్రి రోజా ఒక్కరే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆమె డిఎంకె తరఫున ప్రచారం చేశారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారికంగా పంపిందా? లేకుంటే రోజా సొంతంగా వెళ్లారో తెలియడం లేదు. కానీ తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రోజా ఏపీ సీఎం చంద్రబాబుపై విమర్శలు చేశారు. ఎందుకంటే అక్కడ ఎన్నికల్లో డిఎంకె వ్యతిరేక కూటమికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు చంద్రబాబు. అయితే రోజా పక్కా రాజకీయ వ్యూహంతోనే తమిళనాడు రాజకీయాల వైపు వెళ్లినట్లు పొలిటికల్ వర్గాల్లో ఒక చర్చ బలంగా నడుస్తోంది. ఒకవేళ డీఎంకే గెలిస్తే రోజాకు కీలక పదవి ఇచ్చేందుకు స్టాలిన్ మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. తెలుగు రాజకీయాలకు గుడ్ బై చెప్పి రోజా తమిళ రాజకీయాల్లోకి ప్రవేశించాలన్న ఆలోచనతోనే ఈ ప్రచారానికి దిగినట్లు తెలుస్తోంది.తెలుగు చిత్ర పరిశ్రమతో పాటు బుల్లితెరలో కూడా రోజాకు( అవకాశాలు సన్నగిల్లాయి. ఈ పరిస్థితుల్లో ఏపీలో ఉండడం కంటే తమిళనాడు వైపు వెళ్లిపోవడమే మేలన్న నిర్ణయానికి వచ్చారు రోజా. ప్రస్తుతం ఏపీలో ఆమెకు వ్యతిరేకత ఎక్కువైంది. పైగా వివాదాస్పద ముద్రతో తన కెరీర్ పరంగా కూడా ఇబ్బందికర పరిస్థితులు వచ్చాయి. గతంలో బుల్లితెర హోస్టుగా వ్యవహరించిన ఆమెకు మరోసారి ఛాన్స్ ఇచ్చేందుకు టీవీ ఛానల్ యాజమాన్యాలు కూడా వెనుకడుగు వేస్తున్నాయి. ఇంకోవైపు రాజకీయంగా కూడా పెద్దగా కలిసి రావడం లేదు. ముఖ్యంగా తన సొంత నియోజకవర్గ నగిరిలో ఏమంత పరిస్థితి బాగాలేదు. అక్కడ అభ్యర్థిని మార్చే పరిస్థితిలో ఉన్నారు జగన్మోహన్ రెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి వేరే పార్టీలో చేరుతామన్న కుదిరే పని కాదు. ఈ పరిస్థితుల్లో గౌరవంగా తెలుగు రాజకీయాల నుంచి తప్పుకోవడమే మేలన్న నిర్ణయానికి ఆమె వచ్చినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం తమిళనాడులో డీఎంకే కూటమి మరోసారి అధికారంలోకి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. అందుకే రోజా తనంతట తానుగా డీఎంకేకు మద్దతుగా ప్రచారం చేసేందుకు ముందుకు వచ్చారట. ముఖ్యమంత్రి స్టాలిన్ తో రోజాకు మంచి సంబంధాలే ఉన్నాయి. ఆయనను సోదరుడిగా పరిగణిస్తారు రోజా. అందుకే డీఎంకే గెలిస్తే కీలక నామినేటెడ్ పదవి కట్టబెట్టే ఆలోచనతో స్టాలిన్ ఉన్నారు. డీఎంకే గెలిచిన మరుక్షణం రోజా తమిళనాడు పై ఫుల్ ఫోకస్ పెడతారు. ఇప్పటికే అక్కడ ఆమెకు సినీ గ్లామర్ ఉంది. అందుకే అక్కడ బుల్లితెరపై కూడా అవకాశాలు వస్తాయి. డీఎంకే అధికార ప్రతినిధి హోదాతో పాటు కీలక నామినేటెడ్ పదవి ఆమెకు దక్కే ఛాన్స్ అయితే కనిపిస్తోంది. ఏదైనా తమిళనాడు ఎన్నికల ఫలితాలు వచ్చాక రోజా సంచలన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# డిప్యుటేషన్ల ప్రభావం.. విద్యా లక్ష్యాలకు విఘాతం..

## ఉన్న చోటుకే పోస్టింగులు

### బోధన లేక విద్యార్థుల అవస్థలు..!

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మరోసారి ప్రజా చర్చకు దారితీస్తోంది. చేరికల పెంపు, డ్రాప్‌ఔట్ తగ్గింపు వంటి లక్ష్యాలతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఒకవైపు ఆశలు రేకెత్తిస్తుంటే, మరోవైపు పాఠశాలల్లో పెరుగుతున్న టీచర్ల కొరత, అసమాన కేటాయింపులు, డిప్యుటేషన్ దుర్వినియోగం వంటి




సమస్యలు ఆ లక్ష్యాలనే ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. విద్యార్థిని పాఠశాల గడప దాటించడం ఒక అడుగు మాత్రమే..అతనికి నాణ్యమైన బోధన అందేలా చేయడం అసలు బాధ్యత. ఈ విరుద్ధ దృశ్యం, విద్యా విధానాల రూపకల్పనకంటే వాటి సమర్థవంతమైన అమలే కీలకమని మరోసారి స్పష్టం చేస్తోంది.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, పాఠశాల విద్యా వ్యవస్థలో కనిపిస్తున్న వాస్తవ పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా ఉంది. రాష్ట్రంలో సుమారు 13 వందలకు పైగా పాఠశాలల్లో ఒక్క టీచర్ కూడా లేకపోవడం సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. మరోవైపు 6 వేల 3వందలకు పైగా పాఠశాలలు ఒక్క టీచర్‌తోనే నడుస్తుండటం, దాదాపు 8 వేల 8 వందల పాఠశాలలు కేవలం ఇద్దరు టీచర్లతో కొనసాగుతుండటం పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో చూపిస్తోంది. కనీసం 3 వేల పాఠశాలల్లో స్పష్టమైన టీచర్ల కొరత ఉండగా, సుమారు 4 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా చూస్తే, 10 వేలకు పైగా పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. ఈ గణాంకాలే ప్రభుత్వ హామీలకు, వాస్తవానికి మధ్య ఉన్న అంతరాన్ని బహిర్గతం చేస్తున్నాయి.ఈ పరిస్థితుల కారణంగా దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు విద్యాపరంగా నష్టపోతున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కూడా పెద్ద సంఖ్యలో టీచర్లు డిప్యుటేషన్‌పై ఉండటం మరింత ఆందోళనకరం. 2023 నుంచి ఇప్పటివరకు సుమారు 15 వందల నుంచి 4 వేల మంది టీచర్లు డిప్యుటేషన్‌పై ఉన్నారని అంచనా. ఒకవైపు టీచర్లు లేని పాఠశాలలు ఉండగా, మరోవైపు అవసరం లేని చోట్లకు టీచర్లను డిప్యుటేషన్‌పై పంపించడం స్పష్టమైన పరిపాలనా లోపమేనని చెప్పాల్సి వస్తోంది.సమస్య కేవలం టీచర్ల కొరతలో మాత్రమే లేదు; వారిని సరైన విధంగా కేటాయించకపోవడమే అసలు మూల కారణం. కొన్ని పాఠశాలల్లో టీచర్లు అవసరానికి మించి ఉండగా, మరికొన్ని పాఠశాలలు కనీస సిబ్బంది లేక నడవడం విచారకరం. ఒకచోట అధికం, మరోచోట కొరత..ఈ అసమాన పరిస్థితి విద్యా వ్యవస్థలో సమతుల్యత లేకపోవడాన్ని బలంగా నిరూపిస్తోంది. దీనిని సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

అయితే డిప్యుటేషన్ అనే తాత్కాలిక మార్గాన్ని అధికంగా ఉపయోగించడం వల్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకకుండా, మరింత జటిలం చేస్తోందిడిప్యుటేషన్ వ్యవస్థపై వస్తున్న విమర్శలు కూడా తక్కువేమీ లేవు. ఉన్నతాధికారులతో పరిచయాలు, రాజకీయ పలుకుబడి ఆధారంగా కొంతమంది టీచర్లు తమకు అనుకూలమైన పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యక్తిగత సౌకర్యాలు, పిల్లల విద్య, సులభమైన జీవనశైలి కోసం డిప్యుటేషన్‌ను వినియోగించడం సాధారణ ధోరణిగా మారింది. ఈ ప్రక్రియలో నిజాయితీ, పారదర్శకత లేకపోవడం, సందేహాస్పదంగా మారడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. ముడుపుల ఆరోపణలు వినిపించడం ఈ వ్యవస్థపై నమ్మకాన్ని మరింత దెబ్బతీస్తోంది.డిప్యుటేషన్ వల్ల అసలు నష్టం విద్యార్థులకే జరుగుతోంది. ఒక పాఠశాల నుంచి టీచర్‌ను పంపిస్తే తరలిస్తే, అక్కడి పిల్లలు చదువులో వెనుకబడిపోవడం జరుగుతోంది.

మరోవైపు ఇప్పటికే టీచర్లు సరిపడా ఉన్న పాఠశాలలకు అదనంగా పంపించడం వల్ల, ఆ సిబ్బంది పూర్తిస్థాయిలో వినియోగం కాకుండా ఉండిపోతున్నారు. అంటే ఒకచోట తీవ్ర కొరత, మరోచోట వృథా..ఇది లోప భూయిష్టమైన పరిపాలనకు నిదర్శనం. మానవ వనరులు ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా వినియోగించకపోవడం విద్యా వ్యవస్థకు పెద్ద లోపంగా మారుతోంది.గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ఒకే టీచర్‌తో బహుళ తరగతులను నిర్వహించాల్సిన పరిస్థితి సర్వ సాధారణమవుతోంది. సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే విద్యపై పట్టు కోల్పోతున్నారు. దీని ప్రభావం క్రమంగా పెరిగి విద్యా నాణ్యతను దెబ్బతీస్తోంది. డ్రాప్‌ఔట్ సమస్య మళ్లీ తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది. ఒకవైపు ప్రభుత్వం విద్యార్థుల చేరికలను పెంచేందుకు కృషి చేస్తుండగా, మరోవైపు టీచర్ల సరైన కేటాయింపు లేకపోవడం వల్ల అదే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది.డిప్యుటేషన్ సమస్యను తాత్కాలిక పరిష్కారంగా కొనసాగించడం ఇక సాధ్యం కాదు. ఇది నియంత్రణ లేకుండా సాగితే, విద్యా వ్యవస్థలోని అసలు బలాన్ని దెబ్బతీసే శాశ్వత లోపంగా మారుతుంది. అందుకే ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలి..అవసరం లేని డిప్యుటేషన్లను రద్దు చేయడం, టీచర్లను బోధనకే పరిమితం చేయడం, ఖాళీలను వేగంగా భర్తీ చేయడం అత్యవసరం. అధికారులు ఈ వ్యవస్థను బాధ్యతగా పర్యవేక్షించాలి. టీచర్లు కూడా తమ ప్రాథమిక విధిని గుర్తించి తరగతి గదికి ప్రాధాన్యం ఇవ్వాలి. చివరగా ఒక విషయం స్పష్టం.. పాఠశాలలో టీచర్ లేకపోవడం అంటే ఖాళీ తరగతి మాత్రమే కాదు, అది నేరుగా విద్యార్థి భవిష్యత్తును ప్రభావితం చేసే తీవ్రమైన లోటు. ఇప్పుడే చర్యలు తీసుకోకపోతే, కలిగే నష్టం తిరిగి సరిచేయలేనిది అవుతుంది.

# ఆటో డెబిట్ చేయాలంటే 24 గంటల ముందే సమాచారం

ముంబై, ఏప్రిల్ 23,

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) బ్యాంకింగ్ కస్టమర్ల కోసం మరికొన్ని కొత్త నిబంధనలను ప్రవేశపెట్టింది. ఇక నుంచి బ్యాంకులు ఎలా పడితే అలా మీ అకౌంట్ నుంచి మనీ ఆటోడెబిట్ చేసుకోవడానికి వీల్లేదు. కస్టమర్ల భద్రత కోసం ఆర్బీఐ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ఇక నుంచి ఆటో డెబిట్ చేయాలంటే కస్టమర్‌కు తప్పనిసరిగా 24 గంటల ముందు ఎస్ఎంఎస్ లేదా ఈమెయిల్ ద్వారా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఎంత కట్ చేస్తు?న్నారు..? దానికి గల కారణాన్ని తెలపాల్సి ఉంటుంది. ఓటీటీ సబ్‌స్క్రిప్షన్, ఇన్సూరెన్స్ ప్రీమియం, కారు లోన్ ఈఎంఐ, హోమ్ లోన్ వంటి వాటన్నింటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. బ్యాంకు ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా ఆటో డెబిట్ చేసుకుంటే కస్టమర్లు ఫిర్యాదు చేయవచ్చు.ఆటో డెబిట్ చేసుకోవాలనుకుంటే 24 గంటల ముందు బ్యాంకులు మీకు నోటిఫికేషన్ పంపుతాయి. దీని వల్ల ఈఎంఐకు అవసరమైన డబ్బులను మీరు అకౌంట్లో ఉంచుకుంటారు. దీని వల్ల మీరు లేట్ ఫీజులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇక ఒకవేళ ఆటో డెబిట్ తప్పు అని భావిస్తే మీరు బ్యాంక్ పంపించే నోటిఫికేషన్ ద్వారా రద్దు చేసుకోవచ్చు. బ్యాంకులు ఇక నుంచి ఇష్టానుసారం కస్టమర్‌కు ముందుగానే సమాచారం ఇవ్వకుండా డబ్బులు ఆటో డెబిట్ చేసుకోకూడు. ముందుగా మీ అనుమతి, మీకు సమాచారం ఇచ్చాకే ఆటో డెబిట్ చేసుకోవాలి. ముందుగానే వచ్చే మెస్సేజ్ ద్వారా వివరాలు ఏదైనా తప్పు ఉంటే బ్యాంకును సంప్రదించవచ్చు. అమౌంట్ తప్పుగా ఉంటే సవరించుకోవచ్చుఒకవేళ 24 గంటల ముందే బ్యాంకులు మీకు ఆటో డెబిట్‌కు సంబంధించి సమాచారం ఇవ్వకపోతే ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు. ఇక వినియోగదారుడి సమ్మతి లేకుండా ఒక్క రూపాయి కూడా బదిలీ చేసుకునే హక్కు బ్యాంకులకు లేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. దీనికి సంబంధించి బ్యాంకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అన్ని బ్యాంకులు దీనిని తప్పనిసరిగా పాటించాలని ఆర్బీఐ కొత్త నిబంధనల్లో పేర్కొంది. చాలామంది ఈఎంఐల గురించి మర్చిపోతారు. దీని వల్ల ఈఎంఐ సమాయానికి అకౌంట్‌లో డబ్బులు లేకపోతే బ్యాంకులు బౌన్స్ ఛార్జీలు విధిస్తూ ఉంటాయి. ఇక నుంచి అలాంటి ఛార్జీలు మీకు ఉండవు. బ్యాంకులు ముందే సమాచారం ఇవ్వడం వల్ల మీ అకౌంట్లలో ఆ టైమ్‌కి డబ్బులు ఉంచుకుంటారు. బౌన్స్ ఛార్జీలను బ్యాంకులు భారీగా వసూలు చేస్తున్నాయి. దీనికి ఇప్పటినుంచి చెక్ పడనుందని చెప్పవచ్చు.

# పహల్గమ్ దాడిలో విస్తుపోయే నిజాలు

శ్రీనగర్, ఏప్రిల్ 23, పహల్గామ్‌లో దాడికి ప్లాన్ చేసిన ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులు దేశంలోకి చొరబడ్డాక.. వారికి ఇద్దరు స్థానికులు ఆశ్రయం కల్పించినట్టు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. వాళ్లు వచ్చిన సమాచారాన్ని పోలీసులకు ఇవ్వకుండా వారి వివరాలను గోప్యంగా ఉంచారని అధికారులు తాజాగా తెలుసుకున్నారు. వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచేందుకు సదురు స్థానికులు రూ.3 వేలు తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. కేవలం రూ.3వేలకు కక్కుర్తి పడి 26 మంది ప్రాణాలను ముష్కరుల చేతిలో పెట్టారని తెలియడంతో స్థానిక ప్రజలు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.ఇదిలా ఉండగా పహల్గామ్ దాడి వార్షికోత్సవం సందర్భంగా మరోసారి ఉగ్రవాదులు విష ప్రచారం మొదలుపెట్టారు. జైషే మహమ్మద్ కమాండర్ అబ్దుల్ రవూఫ్‌కు సంబంధించిన ఒక ఆడియో క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో జిహాద్‌లో చేరండి అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో భద్రతా దళాలు మరింత అప్రమత్తమయ్యాయి.అయితే, ఈ ఘటనలో అత్యంత బాధాకరం ఏమిటంటే.. ఒక సంవత్సరం గడిచినా బాధిత కుటుంబాలు ఇప్పటికీ ఆ మానసిక వేదన నుంచి బయటపడలేకపోవడం. ప్రియమైన వారిని కోల్పోయిన ఆ కుటుంబాల జీవితాలు పూర్తిగా మారిపోయాయి. కొందరు చిన్న పిల్లలు తండ్రిని కోల్పోయారు. కొందరు మహిళలు జీవిత భాగస్వామిని కోల్పోయారు. వృద్ధ తల్లిదండ్రులు తమ కుమారులను కోల్పోయి ఒంటరితనంలో జీవిస్తున్నారు.పహల్గామ్ ప్రజల జీవితాల్లో కూడా ఈ దాడి మానసిక గాయాలను మిగిల్చింది. గతంలో సందడిగా ఉన్న వీధులు ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. పర్యాటకుల రద్దీ తగ్గడంతో స్థానిక వ్యాపారులు తీవ్ర నష్టాలు చవిచూశారు. కొంతమంది యువకులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. ఒక ఉగ్రదాడి కేవలం ప్రాణ నష్టానికే పరిమితం కాకుండా, మొత్తం సమాజాన్ని ఎలా దెబ్బతీస్తుందో పహల్గామ్ ఉదాహరణగా నిలిచింది.దేశవ్యాప్తంగా ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ప్రపంచ దేశాలు కూడా ఈ దాడిని ఖండించాయి. అమాయకులపై ఇలాంటి దాడులు మానవత్వానికి మచ్చ అని అంతర్జాతీయ వర్గాలు తెలిపాయి. భారత్ తీసుకున్న కఠిన చర్యలు దేశ భద్రతపై ఉన్న నిబద్ధతను ప్రపంచానికి చాటిచెప్పాయి. ప్రధాని మోదీ చేసిన నివాళి సందేశం ఈ సందర్భంగా దేశ ప్రజల్లో భావోద్వేగాన్ని రేకెత్తించింది. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్న స్పష్టమైన సంకేతాన్ని ఆయన మరోసారి ఇచ్చారు. దేశం మొత్తం బాధిత కుటుంబాల వెంట ఉందన్న సందేశం వారికి కొంతమేర ధైర్యాన్ని ఇచ్చింది.పహల్గామ్ దాడి మనకు ఒక కఠినమైన నిజాన్ని గుర్తుచేస్తోంది. ప్రకృతి అందాల మధ్య కూడా భద్రత ఎంత ముఖ్యమో, ఉగ్రవాదం ఎంత దారుణమైనదో ఈ ఘటన స్పష్టం చేసింది. ప్రాణాలు కోల్పోయిన 26 మంది అమాయకుల జ్ఞాపకాన్ని దేశం ఎప్పటికీ మర్చిపోలేదు. వారి కుటుంబాల బాధను మాటల్లో చెప్పలేం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం అంతా ఒక్కటిగా నిలబడదాం

# టీసీఎస్ నాసిక్ లో కొత్త కోణం

మహారాష్ట్ర, ఏప్రిల్ 23

: మహారాష్ట్ర, నాసిక్ టీసీఎస్ కార్యాలయంలో మత మార్పిడి ఒత్తిళ్లు, లైంగిక వేధింపుల కేసులో భయానక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. లోతుగా దర్యాప్తు చేస్తున్న కొద్దీ నిందితులు బాధితుల పట్ల ఎంత దారుణంగా ప్రవర్తించారో వెలుగులోకి వస్తోంది. బాధితురాళ్లు పోలీసుల విచారణలో తాము ఎదుర్కొన్న దారుణాలను వెల్లడిస్తున్నారు. నిందితులు హిందూ మతంతో పాటు, హిందూ దేవుళ్లపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడమే కాక.. తమతో కూడా అసభ్యకరంగా ప్రవర్తించేవారని బాధితులు వెల్లడించారు. అంతేకాక తమను బురఖా ధరించాలని ఒత్తిడి చేసేవారని తెలిపారు.పోయిన సంవత్సరం వివాహం చేసుకొని టీసీఎస్‌లో చేరిన ఓ బాధితురాలు తన వాంగ్మూలంలో పేర్కొన్న విషయాలు.. అక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో కళ్లకు కడుతున్నాయి. ట్రైనింగ్ సమయంలో షారుక్ ఖురేషి అనే ట్రైనింగ్ లీడర్‌తో పాటు మరో డిపార్ట్‌మెంట్‌కు చెందిన రజా మేమన్ అనే వ్యక్తి ఇద్దరూ కలిసి తనతో అసభ్యంగా మాట్లాడేవారని.. తన శరీరం గురించి, వైవాహిక జీవితం గురించి ఇబ్బందికర వ్యాఖ్యలు చేసేవారని బాధితురాలు వెల్లడించింది.ఆఫీసులో మాత్రమే కాక క్యాంటీన్‌లో కూడా తన పక్కనే కూర్చొని అసభ్యకరంగా తాకేవారని.. తనలాంటి వారంతా బురఖా ధరించకపోవడం వల్లే అత్యాచారాలు జరుగుతున్నాయని తనను విమర్శించేవారని వెల్లడించింది. అంతటితో ఆగక.. తనను కూడా బురఖా ధరించాలని ఒత్తిడి చేసేవారని చెప్పుకొచ్చింది. ఉగాది (గుడి పడ్వా) రోజు చీర కట్టుకుని ఆఫీసుకు వచ్చినప్పుడు తనను బలవంతంగా కౌగిలించుకొనే ప్రయత్నం చేశారని కన్నీటిపర్యంతం అయ్యింది.దిలా ఉంటే ఈ కేసులో కీలక నిందితురాలిగా ఉన్న నీదా ఖాన్ అనే ఉద్యోగిని తాను 2 నెలల గర్భిణిని అని.. ఈ కారణంతో తనకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ముందస్తు బెయిల్ కి దరఖాస్తు చేసింది. కానీ నాసిక్ సెషన్స్ కోర్టు ఆమెకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ కేసు కార్పొరేట్ వరల్డ్‌లో సంచలనంగా నిలిచింది

# సుప్రీం కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం



హైదరాబాద్, ఏప్రిల్ 22,

కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై వెలువడిన హైకోర్టు తీర్పు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనాన్ని సృష్టించింది. చట్టబద్ధతకూ, సహజ న్యాయసూత్రాలకూ మధ్య జరిగిన ఈ న్యాయపోరాటం ఇటు ప్రభుత్వానికి, అటు బీఆర్ఎస్ అగ్రనేతలకు చెరో సగం విజయాన్ని, చెరో సగం ఆందోళనను మిగిల్చింది. ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయబోతోందన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై ప్రభుత్వం తక్షణమే ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకుండా హైకోర్టు బ్రేక్ వేసింది. విచారణా చట్టం సెక్షన్ 8బి ప్రకారం, నివేదికలో ఎవరినైనా బాధ్యులుగా పేర్కొనే ముందు వారి వివరణ కోరడం తప్పనిసరి. అయితే, సదరు నిందితుల వాదన వినకుండానే దోషులుగా తేల్చడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సాంకేతిక లోపం కారణంగా నివేదికలోని చర్యల భాగం ప్రస్తుతానికి అమలుకు వీలులేనిదిగా మారిపోయింది, ఇది బీఆర్ఎస్ అగ్రనేతలకు పెద్ద ఊరటనిచ్చింది.ప్రభుత్వానికి ఈ తీర్పు కొంత మేర చేదును మిగిల్చినప్పటికీ, మరో కోణంలో చట్టబద్ధమైన విజయాన్ని అందించింది. కాళేశ్వరం అక్రమాలపై విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 6ను హైకోర్టు సమర్థించింది. కమిషన్ ఏర్పాటులో ఎటువంటి రాజ్యాంగ ఉల్లంఘనలు లేవని, అవకతవకలపై విచారణ జరిపే పూర్తి అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. దీనివల్ల కమిషన్ నిర్వహించిన విచారణ ప్రక్రియకు గుర్తింపు లభించినట్లయింది, ఇది భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకునే తదుపరి చర్యలకు ఒక బలమైన పునాదిగా నిలుస్తుంది. విచారణ చట్టబద్ధతను కోర్టు అంగీకరించడం బీఆర్ఎస్ పార్టీకి ఆందోళన కలిగించే అంశం. మరోవైపు, అక్రమాలను నిరూపించే నివేదిక ఉన్నప్పటికీ, ప్రక్రియ లోపాల వల్ల రాజకీయంగా మైలేజ్ పొందలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిబంధకంగా మారింది. హైకోర్టు లేవనెత్తిన సాంకేతిక అంశాలపై వెనక్కి తగ్గకూడదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సాక్ష్యాధారాలతో కూడిన కమిషన్ నివేదికను కేవలం నోటీసుల కారణంతో పక్కన పెట్టడం సరికాదని న్యాయ నిపుణులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఈ కారణంగా హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించుకుంది. కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంచారు. హైకోర్టు తీర్పుతో కేసీఆర్, హరీష్ రావులకు ముప్పు పూర్తిగా తొలగిపోయిందని భావించలేరని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒకవేళ సుప్రీంకోర్టులో చుక్కెదురైతే, ప్రభుత్వం మరో వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. హైకోర్టు సూచించినట్లుగా నిందితులకు నోటీసులు ఇచ్చి, వారి వాదనలు విన్న తర్వాత సవరించిన నివేదికను సమర్పించేలా కమిషన్‌కు అదనపు గడువు ఇచ్చే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో విచారణ మళ్లీ మొదటికి వస్తుంది తప్ప, బాధ్యత నుండి తప్పించుకోవడం సాధ్యం కాదని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. ఈ న్యాయపోరాటం ఇప్పుడు అత్యంత ఉత్కంఠభరితమైన దశకు చేరుకుంది. తదుపరి పోరాటం ఢిల్లీలోని సుప్రీంకోర్టు వేదికగా సాగుతుందాస కొత్త నివేదిక రూపంలో రాష్ట్రంలోనే కొనసాగుతుందా అన్నది ప్రభుత్వ వ్యూహంపై ఆధారపడి ఉంటుంది.

# మాజీ సైనికుడి మద్యం వ్యాపారం గుట్టురట్టు!

హైదరాబాద్, ఏప్రిల్ 22,

హైదరాబాద్‌కు చెందిన ఓ సైనిక ఉద్యోగి వివిధ ఆర్మీ క్యాంటీన్ల నుంచి మద్యం తీసుకొచ్చి అమ్ముతున్న గుట్టు బయటపడింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టిన ఆపరేషన్‌లో అతని వద్ద ఉన్న 10 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యాన్ని ఆర్మీ క్యాంటీన్ల నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి సిటీలో అధిక ధరకు అమ్ముతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యాపారం చేస్తున్న వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతని కోసం అధికారులు గాలిస్తున్నారు. అధికారుల చెప్పిన వివరాలు ప్రకారం ప్రీమియం మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సీసాలను బెంగళూరు, హర్యానాలోని ఆర్మీ క్యాంటీన్ల నుంచి తీసుకొచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఆర్మీ క్యాంటీన్ల నుంచి తీసుకొచ్చి బాటిళ్లు ఆయా వ్యక్తులు మాత్రమే వినియోగించడానికి అనుమతి ఉంది. కానీ ఈ సీరాలను వేరే వ్యక్తులకు అమ్మడానికి లేదు. కానీ సదరు వ్యక్తి విక్రయించినట్టు గుర్తించారు.ఈ కేసులో దొడ్ల సురేష్ రెడ్డి అనే వ్యక్తి ప్రధాన నిందితుడిగా గుర్తించారు. ఆర్మీ నుంచి రిటైర్ అయిన తర్వాత ఈ పని చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ నెట్‌వర్క్‌ను నడవడానికి అతను తన సైనిక సంబంధాలను ఉపయోగించుకుంటున్నాడని, చాలా కాలంగా ఈ అక్రమ వ్యాపారంలో పాలుపంచుకున్నట్టు దర్యాప్తులో తేలింది. పక్కా సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. జీవన్ కిరణ్ సుభాష్ చందర్ అఖిల్‌తో కలిసిన ఎక్సైజ్ శాఖ టీం ఈ ఆపరేషన్ చేపట్టింది. హస్తినాపురంలోని శ్రీరమణ కాలనీ ఫేజ్ టూలో ఉన్న ఒక ఇంటిపై దాడి చేసిందీ టీం. ఈ దాడిలో భారీ సంఖ్యలో మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన విషయం కాదని, దీని వెనుక ఒక ఆర్గనైజ్డ్ నెట్‌వర్క్ ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ అక్రమ సరఫరా చైన్‌లో ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో దర్యాప్తు సాగుతోంది. వారి వివరాలపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటన డిఫెన్స్ క్యాంటీన్‌లో జరుగుతున్న చట్టవిరుద్ధ కార్యకలాపాలపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇలాంటి కేసుల్లో కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వారు దొరికిన తర్వాత మరిన్ని వివరాలు ఈ కేసులో వెలుగు చూసే అవకాశం ఉందని అంటున్నారు.

# ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు సెలవులు

విజయవాడ, ఏప్రిల్ 23

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ స్కూల్ విద్యార్థులకు శుభవార్త అందించింది. రాష్ట్రంలోని స్కూళ్లకు ఈ నెల 24వ తేదీ నుండి వేసవి సెలవులను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. అకడమిక్ కేలండర్ ప్రకారం వెల్లడించిన ఈ సెలవులు పూర్తయిన అనంతరం జూన్ 12న స్కూల్స్ రీఓపెన్ చేయనున్నారు. సెలవుల సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని ప్రజలకు జాగ్రత్తలు సూచించారు. చెరువులు, బావులు, కాలువల వద్ద ఈతకు వెళ్లి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున జిల్లా విద్యాధికారులకు విద్యాశాఖ పలు కీలక సూచనలు జారీ చేసింది.విద్యా సంవత్సరం ముగిసేలోపు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు సమ్మర్ సీజన్‌లో భద్రతా చర్యలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యంగా పెద్దల పర్యవేక్షణ లేకుండా పిల్లలు బావులు, నదులు, చెరువులు, కాలువల వద్దకు వెళ్లకూడదని విద్యార్థులకు స్పష్టం చేయాలని సర్క్యులర్‌లో సూచించింది. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో బయట తిరగకూడదని, తిరిగితే వచ్చే అనారోగ్య సమస్యలను విద్యార్థులకు వివరించాలని పేర్కొంది.పాఠశాల నోటీసు బోర్డులపై భద్రతా నియమాలను విధిగా ప్రదర్శించడంతో పాటు, తల్లిదండ్రులకు కూడా అవసరమైన సూచనలు చేయాలని ఏపీ స్కూల్ విద్యాశాఖ తెలిపింది. సెలవుల్లో పిల్లలపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని, ఎండ వేడి నుండి వారిని రక్షించుకోవాలని.. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులను కోరింది. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు.

# కొత్త రాష్ట్రంలో రెండోసారి సమ్మె

హైదరాబాద్, ఏప్రిల్ 23 తెలంగాణ రాజకీయ చరిత్రలో 2019లో జరిగిన ఆర్టీసీ సమ్మె ఒక పెను సంచలనం. కేసీఆర్ ప్రభుత్వానికి, కార్మిక సంఘాలకు మధ్య జరిగిన ఆ సుదీర్ఘ పోరాటం అనేక మలుపులు తిరిగింది. 2019 అక్టోబరు 5న, సరిగ్గా దసరా పండుగకు ముందు రోజున ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి, జీతాల పెంపు వంటి 26 డిమాండ్లతో సుమారు 48 వేల మందికి పైగా కార్మికులు విధులను బహిష్కరించారు. పండుగ సమయంలో ప్రజలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నా, తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదని కార్మిక సంఘాల జేఏసీ భీష్మించుకూర్చుందిసమ్మెపై అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత కఠినంగా స్పందించారు. ప్రభుత్వం విధించిన గడువు లోపు విధుల్లో చేరని వారందరూ తమంతట తామే ఉద్యోగాల నుంచి డిస్మిస్ అయినట్లు ప్రకటించారు. ఆర్టీసీలో కేవలం 1,200 మంది మాత్రమే ఉద్యోగులు మిగిలారని, మిగిలిన వారందరినీ తిరిగి తీసుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సమ్మె కాలంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ డ్రైవర్లను, కండక్టర్లను నియమించి బస్సులను నడిపింది. సుమారు 52 రోజుల పాటు సాగిన ఈ సమ్మెలో అనేక విషాదాలు చోటుచేసుకున్నాయి. ఉద్యోగాలు పోతాయన్న భయంతో, ఆర్థిక ఇబ్బందులతో సుమారు 25 మందికి పైగా కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం, గుండెపోటుతో మరణించడం రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ వివాదం హైకోర్టుకు చేరింది. ఇరువర్గాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. కానీ, ప్రభుత్వం చర్చలకు మొగ్గు చూపలేదు. చివరికి, నవంబరు 25న కార్మిక సంఘాలు ఒక అడుగు వెనక్కి వేసి, ఎటువంటి షరతులు లేకుండా సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించాయి. తాము విధుల్లో చేరతామని చెప్పినప్పటికీ, ప్రభుత్వం వెంటనే వారిని అనుమతించలేదు, దీనితో మరో రెండు రోజులు సందిగ్ధత కొనసాగింది.నవంబరు 28న కేసీఆర్ తన వైఖరిని మార్చుకుని, కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్మికులు నా బిడ్డలు, వారు యూనియన్ నాయకుల మాట విని తప్పుదారి పట్టారు అని పేర్కొంటూ వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ప్రగతి భవన్‌లో కార్మికులతో కలిసి భోజనం చేసి, ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించే బాధ్యతను వారిపై పెట్టారు. అలా ఒక తీవ్రమైన పోరాటం ఊహించని విధంగా సుఖాంతమైంది.

# ఆర్టీసీ ఉద్యోగిపై కేసు నమోదు

మమబూబాబాద్ ఏప్రిల్ 23

మహబూబాబాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసులు అత్యుత్సాహం చూపించారు. మహబూబాబాద్, తొర్రూరు డిపోల వద్ద భారీగా పోలీసులు మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు అయింది. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేసారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు

# సూర్యాపేటలో రెండవ రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె

సూర్యాపేట ఏప్రిల్ 23

సూర్యాపేట జిల్లాలో ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజు కొనసాగింది. సూర్యాపేట డిపో ఎదుట పోలీసులకు, కార్మికులకు మధ్య వాగ్వాదం జరిగింది.

తాము సమ్మెలో ఉండగా బస్సులు బయటకి ఎలా పంపిస్తారంటూ పోలీసులపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

# భారీ ప్రక్షాళనకు రేవంత్ ప్లాన్

హైదరాబాద్, ఏప్రిల్ 23,

రాష్ట్ర పాలనా యంత్రాంగంలో తన మార్క్‌తో భారీ ప్రక్షాళనకు ప్లాన్ చేస్తున్నారట సీఎం రేవంత్ రెడ్డి. సెక్రటేరియట్ నుంచి జిల్లా కలెక్టరేట్ దాకా ఐఏఎస్ ట్రాన్స్‌ఫర్లలో ఉన్న అన్ని చిక్కులకు చెక్ పెట్టే స్కెచ్ వేస్తున్నారట. అడ్మినిస్ట్రేటివ్ రీషఫ్లింగ్‌కు రెడీ అవుతున్నారట. రేవంత్ సరికొత్త కసరత్తు వెనుక మాస్టర్ ప్లాన్ ఏంటి?అధికార యంత్రాంగంలో మార్పులు, చేర్పులపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టారు సీఎం రేవంత్. ఇందులో భాగంగా త్వరలోనే భారీగా ఐఏఎస్ ల బదిలీలు చేయబోతున్నారట. ఈసారి ట్రాన్స్‌ఫర్స్ కసరత్తు..ఇప్పటివరకు ఒక లెక్క..ఇక నుంచి మరో లెక్క అన్నట్లు నడుస్తోందట. రెండున్నరేళ్ల కాలంలో ఐదారుసార్లు ఐఏఎస్‌ల బదిలీలు చేసింది రేవంత్ సర్కార్. ఒక్కోసారి..పదుల సంఖ్యలో టాన్స్‌ఫర్లు చేసిన సందర్భాలున్నాయి. జిల్లా కలెక్టర్ల నుంచి మొదలుకుని..సెక్రటేరియట్‌లో ప్రిన్సిపల్, స్పెషల్ సెక్రటరీల వరకు..అందరికీ స్థానం చలనం కల్పించింది. అయితే..ఈ బదిలీల్లో జరిగిన చిన్న తప్పిదాలు? కింది స్థాయి అధికారుల నుంచి..పై స్థాయి అధికారుల వరకు..క్లాషెస్‌కు దారితీసింది.సీనియర్ వర్సెస్ జూనియర్ కోల్డ్ వార్ ఇష్యూ అయింది. గ్రేటరక్ కమిషనర్‌గా ఓ అధికారికి పోస్టింగ్ ఇచ్చిన సర్కార్..ఆయన కింద జోనల్ కమిషనర్‌గా..ఓ సీనియర్ ఐఏఎస్ ఉన్న విషయాన్ని కూడా గుర్తించలేకపోయిందట. దీంతో నొచ్చుకున్న సదరు సీనియర్ ఐఏఎస్ ఇగో హర్ట్ కావడంతో లాంగ్ లీవ్‌లో వెళ్లిపోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది.అధికారుల్లో..తాము వేరయా అన్నట్లు..ఐఏఎస్ అధికారులు భావిస్తుంటారు..వ్యవహరిస్తుంటారు కూడా. ఇలా కన్ఫర్డ్ ఐఏఎస్‌లకు..ఐఏఎస్‌ల మధ్య కూడా..గతంలో డిసిగ్నేషన్ పంచాయితీతో ఇగో క్లాషెస్ వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఈ మధ్య కన్ఫర్డ్ ఐఏఎస్‌లలో ఒకరికి స్పెషల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇవ్వగా..ఆయనకంటే సీనియర్ ఐఏఎస్ సెక్రటరీగా ఉన్న సందర్భం ఎదురైంది. దీంతో సదరు ఐఏఎస్..వాట్ ఈజ్ దిస్ అంటూ బాగా ఫీల్ కావడంతో..అప్పటికప్పుడు సెక్రటరీని స్పెషల్ సెక్రటరీగా మార్చారట.ఇక టూరిజం శాఖలో అయితే ఇప్పటివరకు అరడజన్ మంది సెక్రటరీలు రావడం..పోవడం ఓ తంతుగా మారిపోయిందట. ఇక ఎన్నిసార్లు బదిలీలు జరిగినా.. హెల్త్ సెక్రటరీ సహా మరికొందరికి ఎందుకోగానీ స్థాన చలనం లేదనే టాక్ సెక్రటేరియట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇలా..ఒక్కోచోట..ఒక్కో రకంగా..ఐఏఎస్‌ల ట్రాన్స్‌ఫర్లలో జరుగుతున్న పొరపాట్లను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి..వీటన్నింటికి చెక్ పెట్టాలని భావిస్తున్నారట. మరోవైపు తెలంగాణ అధికారులకు కీలక పోస్టింగ్‌లు ఇవ్వడం లేదన్న విమర్శలకు కూడా చెక్ పెట్టాలన్న ఆలోచనలో రేవంత్ అండ్ టీం కసరత్తు చేస్తోందట. మరికొన్ని శాఖల్లో మంత్రులకు, ఐఏఎస్‌ల మధ్య జరుగుతున్న పంచాయతీలకు చెక్ పెట్టేలా షఫ్లింగ్ చేయనున్నారని తెలుస్తోంది.త్వరలో రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల సమూల బదిలీలకు రంగం సిద్దం చేస్తున్నారన్న టాక్ నడుస్తోంది. కేవలం బదిలీలు అంటే ఒకరిని తీసి మరొకరిని పెట్టడం కాదు..పూర్తిగా ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా కసరత్తు జరుగుతోందని అంటున్నారు. ముఖ్యంగా..సీనియర్, జూనియర్ల కోల్డ్ వార్, కన్ఫర్డ్ ఐఏఎస్, ఐఏఎస్‌ల మధ్య ఇగో క్లాషెస్‌కు ఫుల్ స్టాప్ పెట్టేలా ఎక్సర్ సైజ్ చేస్తోందట సర్కార్.కీలకమైన పోస్టుల కోసం జరుగుతున్న పోటీకి బ్రేక్స్ వేసి..ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలి? ఎవరి సీనియారిటీకి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనేది ఒక పద్ధతి ప్రకారం జరగాలని రేవంత్ రెడ్డి క్లియర్ కట్ డైరెక్షన్స్ ఇచ్చారట. దీనిలో భాగంగా..రేవంత్ మార్క్ అడ్మినిస్ట్రేటివ్ రీషఫ్లింగ్‌తో న్యూటీమ్ రెడీ అవుతుందని టాక్. ఈ సారి జరిగే ఐఏఎస్‌ల బదిలీల్లో..అధికారుల లాబీయింగ్‌కు చెక్



పెట్టి..ఫెర్మామెన్స్, లాయల్టీ, ఎఫీషియన్సీకి పెద్దపీట వేయనున్నారట. ఇప్పటివరకు పనితీరు బాగా కనబరిచిన అధికారులకు ప్రమోషన్లు ఇవ్వాలన్నది సీఎం ఆలోచన అంటున్నారు. మొత్తానికి రేవంత్ రెడ్డి తన మార్క్ మార్పులతో పర్ఫెక్ట్ టీమ్‌ను సెట్ చేసుకునే పనిలో బిజీగా ఉన్నారట. తన స్పీడ్‌కు అనుగుణంగా..క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులను ఎంపిక చేయనున్నారట. రేవంత్ మార్క్ ఐఏఎస్ టీమ్ ఎలా ఉండనుందనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది.

# కాళేశ్వరంలో కొత్త ట్విస్టులు...

## పంతం నీదా...నాదా

హైదరాబాద్, ఏప్రిల్ 23,

సర్కార్ విచారణ..బీఆర్ఎస్ అబ్జక్షన్..ఎట్టకేలకు కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను నిలిపివేసింది హైకోర్టు. కమిషన్ 655 పేజీల రిపోర్ట్ ఇస్తే..ఆ నివేదికతో పాటు కమిషన్ విచారణ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కారు పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టును నిలిపివేసింది రాష్ట్ర



అత్యున్నత న్యాయస్థానం. రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు ఇచ్చింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎలాంటి నిబంధనలు పాటించలేదని స్పష్టం చేసింది హైకోర్టు.హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు లాంటిదంటూ బీఆర్ఎస్ అటాక్ స్టార్ట్ చేసింది. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మాని..మేడిగడ్డ పిల్లర్లకు రిపేర్లు చేయాలని మాజీ ఇరిగేషన్ మినిస్టర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు.కాళేశ్వరం కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్ధించినట్లు కాంగ్రెస్ నేతలు చెప్పుకోవడం ఆసక్తికరంగా మారింది. ఏ ఇష్యూపై అయినా కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని..కానీ ఆ కమిషన్ నిబంధనలు పాటించలేదని కోర్టు చెప్పిన విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు బీఆర్ఎస్ లీడర్లు. రేవంత్ సర్కార్ మాత్రం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. గురువారం జరిగే క్యాబినెట్‌లో భేటీలో డిస్కస్ చేసి సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలని భావిస్తున్నారట.గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై రేవంత్ సర్కార్ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి మాట్లాడిన తీరుపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏకంగా తనను విచారణకు పిలిచే అధికారం జస్టిస్ నరసింహారెడ్డికి లేదంటూ కేసీఆర్ ఇచ్చిన రిప్లై అప్పట్లో చర్చకు దారితీసింది. ఈ విచారణ చట్ట విరుద్ధమని, రాజకీయ కక్షతో ఏర్పాటు చేశారని మాజీ సీఎం కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలతో జస్టిస్ నరసింహారెడ్డి విచారణ కమిషన్ ఛైర్మన్ పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.ఇప్పుడు కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై కూడా హైకోర్టుకెళ్లి మరీ ఆర్డర్స్ తెచ్చుకుంది బీఆర్ఎస్. అపోజిషన్‌లోకి వచ్చినప్పటి నుంచి కారు పార్టీని ఈ రెండు ఇష్యూస్‌లో ఆరోపణలు వెంటాడుతున్నాయి. అయితే ఈ అంశాలపై ఇప్పటివరకు తాము చేసిన పోరాటం ఫలించిందని..గులాబీ దళం హ్యాపీగా ఫీల్ అవుతోంది. రేవంత్‌ది రాజకీయ కక్ష సాధింపు చర్యగా రివర్స్ అటాక్ చేస్తోంది. ఈ రెండు ఇష్యూస్‌కు ఇంతటితో ఎండ్‌కార్డ్ పడ్డట్లేనా? వచ్చే ఎన్నికల వరకు కాళేశ్వరం చుట్టే రచ్చ జరగబోతోందా అనేది ఇప్పటికైతే సస్పెన్స్‌గానే ఉంది.మరోవైపు కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించలేదని బీజేపీ అంటోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందంలో భాగంగానే హైకోర్టు ఆర్డర్స్ వచ్చాయని ఆరోపిస్తోంది. సీబీఐ విచారణ కోసం లేఖ రాస్తే..బీజేపీ తమ విజ్ఞప్తిని తొక్కి పెట్టిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. బీఆర్ఎస్ నేతలను సేవ్ చేసేందుకు బీజేపీ ఆరాటపడుతోందని విమర్శిస్తోంది. బీజేపీ మాత్రం ఎంటైర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరపాలని రేవంత్ సర్కార్ లేఖ రాయలేదని చెప్తోంది. పైగా కాళేశ్వరం రిపోర్ట్‌తో పాటు..ఔఆూం నివేదికను బేస్ చేసుకుని విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందని అంటోంది బీజేపీ. ఔఆూం రిపోర్ట్ ఆధారంగా ఒక్క మేడిగడ్డపై దర్యాప్తు చేస్తే ఒరిగేదేమి ఉండదని స్పష్టం చేస్తోంది.ఔఆూం కేవలం డ్యామ్ సేఫ్టీ, డిజైన్‌పైనే అభ్యంతరాలు తెలిపిందని..అవినీతిపై ఎక్కడా క్లారిటీ ఇవ్వలేదని చెప్తోంది బీజేపీ. రేవంత్‌కు నిజాయితే ఉంటే..మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ చేయాలని లేఖ రాసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటూ బీజేపీ సేఫ్ గేమ్‌కు తెరదీసింది. ఇలా కమిషన్ చుట్టూ ట్రయాంగల్ వార్ నడుస్తోంది. ఎట్టకేలకు బీఆర్ఎస్ మాత్రం హ్యాపీగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే..తాము ఇంప్లీడ్ కావాలని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మాజీమంత్రి హరీశ్‌రావు ఢిల్లీ వెళ్లి లీగల్ ఎక్స్‌పర్ట్స్‌తో డిస్కస్ చేసి వచ్చారు. స్టేట్ సర్కార్ సుప్రీంలో పిటిషన్ వేస్తే..హైకోర్టు తీర్పు ఆధారంగా..సుప్రీంలో ఫైట్ చేయాలనేది బీఆర్ఎస్ ప్లాన్‌గా తెలుస్తోంది. ఎంటైర్ కాళేశ్వరం ఎపిసోడ్‌లో బీఆర్ఎస్‌కు ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగినా..కరెక్ట్ ఎన్నికల హీట్ మొదలయ్యే టైమ్‌కు హైకోర్టు ఇచ్చిన తీర్పు అడ్వాంటేజ్‌గా భావిస్తోంది గులాబీ దళం.

# కొనుగోలులో కొర్రీలు..

వరంగల్, ఏప్రిల్ 23,

యాసంగిలో పెద్ద మొత్తంలో పండించిన మక్కల అమ్మకాలకు అన్నదాతలు ఆరిగోస పడుతున్నారు. దిగుబడికి తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం, ఏర్పాటు చేసిన అరకొర కేంద్రాల్లో ఇప్పటికే వేల బస్తాల మక్కలు పేరుకుపోవడం, తేమ, ఇతర సాకులతో కొర్రీలు పెడుతుండడంతో రైతులు పండించిన పంటను నిల్వ చేసుకునే పరిస్థితి లేక అగ్గువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి ఆర్థికంగా నష్టపోవలసిన పరిస్థితి నెలకొంది.ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో మక్కలకు క్వింటాల్ కు 2,400 రూపాయలు చెల్లిస్తుండగా, అక్కడ రోజుల తరబడి నిరీక్షించే పరిస్థితి లేక ప్రైవేటు వ్యాపారులకు క్వింటాలకు కనిష్టంగా 1,500 నుండి గరిష్టంగా 1,900 వరకు విక్రయించి క్వింటాలకు 400 నుండి 500 రూపాయల చొప్పున నష్టపోతున్నారు. యాసంగి సీజన్లో జిల్లా వ్యాప్తంగా లక్షన్నరకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఎకరానికి తక్కువలో తక్కువ 25 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వచ్చింది.ఫలితంగా జిల్లాలో ఎక్కడ చూసినా మక్కజొన్నలే కనిపిస్తున్నాయి. అయితే జిల్లా వ్యాప్తంగా 20 కొనుగోలు కేంద్రాలను మార్క్ఫెడ్ సంస్థ ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో విక్రయించడానికి తెచ్చిన మక్కలతో కిక్కిరిసిపోవడంతో కొనుగోళ్లకు జాప్యం జరుగుతోంది. ఒక్కో రైతు 20 రోజుల నుండి కొనుగోలు కేంద్రాల్లో మక్కలను విక్రయించడానికి పడికాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రోజుల తరబడి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షించలేక, సాగు చేసిన మక్క పంట నిల్వను చూసుకునే పరిస్థితి లేక, వాతావరణ మార్పుల నేపథ్యంలో ఎంతకు అంతకు అమ్మడానికి అన్నదాతలు ఆసక్తి చూపిస్తున్నారు. ఫలితంగా మార్క్ఫెడ్ సంస్థ ద్వారా మక్కలు విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన రైతులు కొనుగోళ్లకు తేమ, ఎకరానికి 25 క్వింటాళ్ల మక్కలు మాత్రమే కొంటామని,ఇతర సాకులతో కొర్రీలు పెట్టడం వల్ల గత్యంతరం లేని పరిస్థితుల్లో అగ్గువకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారు.ప్రైవేట్ ట్రేడర్లు ఇదే అదనుగా భావించి కనీసం మద్దతు ధరకు మక్కలు కొనకుండా, ఇష్టం ఉన్న ధరకు కొంటున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు, ఇటు ప్రైవేటు ట్రేడర్ల దోపిడీ వల్ల ఈ యాసంగి సీజన్లో మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.యాసంగి సీజన్లో పండించిన మక్కజొన్న పంట వ్యాపారులకు లాభాల సిరులు కురిపిస్తుండగా, ఆరుగాలం కష్టపడి పండించిన అన్నదాతకు మద్దతు ధర లభించక నష్టాల పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు మొక్కజొన్నలకు క్వింటాలకు కనిష్టంగా 1750 రూపాయలు మాత్రమే పెడుతున్నారని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి విక్రయించే పరిస్థితిలో సిద్ధం చేసిన మక్కలకు కూడా 1900 రూపాయలకు మించి ధర పెట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అమ్మకానికి సిద్ధం చేసిన పంట నిలువ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ట్రేడర్లకు విక్రయిస్తున్నట్లు రైతులు చెప్పారు. ప్రైవేటు ట్రేడర్లకు మక్కలు, ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతుల నుండి చార్జీల పేరుతో దోపిడీ చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా వే బ్రిడ్జి కాంటా వేయించినప్పటికీ, హమాలీ, కూలి, దడువాయి చార్జీల పేరుతో బస్తాకు 16 రూపాయల నుండి 23 రూపాయల వరకు కోత విధిస్తున్నారని రైతులు చెబుతున్నారు. నేరుగా వే బ్రిడ్జీ లో కాంట వేయించి ఆ చార్జీలను కూడా రైతులే చెల్లిస్తూ, ప్రైవేటు వ్యాపారికి చెందిన స్థలంలో అన్లోడ్ చేస్తున్నామని, అయినప్పటికీ ఇతర చార్జీల పేరుతో కోతలు పెడుతుండడంతో అటు తగ్గించి రెండు విధాలుగా తాము నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

# కేటీఆర్ కవిత ఫైట్..

హైదరాబాద్, ఏప్రిల్ 23, (

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోసించిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తొమ్మిదిన్నరేళ్లు రాష్ట్రాన్ని పాలించాడు. కొడుకు, కూతురు, అల్లుడు, సడ్డకుని కొడుకు ఇలా సకుటుంబ సపరివార సమేతంగా పాలనలో భాగస్వాములయ్యారు. 2023 ఎన్నికల్లో తెలంగాణ ఓటర్లు కేసీఆర్ పార్టీని తిరస్కరించారు.




కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్‌లో కుమ్ములాటలు బయట పడ్డాయి. అధికారంలో ఉన్నప్పటి నుంచే ఆధిపత్య పోరు వార్తలు వచ్చినా నేతలు ఖండించారు. కానీ ఇప్పుడు అన్న చెల్లెలుకు పడడం లేదు.. బావా మరదలికి పడడం లేదు. దీంతో కూతురును ఒంటరి చేసి పార్టీనుంచి మెడలు పట్టి గెంటేసినంత పనిచేశారు. అయినా కూతురు బాపుకు వ్యతిరేకంగా ఎక్కడా మాట్లాడలేదు. అన్నను, బావనే టార్గెట్ చేస్తూ వచ్చింది. కానీ కొత్త పార్టీని లాంచ్ చేయబోతున్న కూతురు ఇప్పుడు బాపును కూడా టార్గెట్ చేసింది. మొత్తానికి అన్న చెల్లెలు గొడవలో చివరకు బాపే బలి అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.కవిత ఇప్పుడు విమర్శల కంచెను కుటుంబంలోకే మళ్లించినట్టు కనిపిస్తోంది. ఇప్పటివరకు పరోక్షంగా మాత్రమే స్పృశించిన కేసీఆర్‌పై కూడా ఆమె నేరుగా ప్రశ్నలు సంధించడం, ఆమె రాజకీయ పంథాలో స్పష్టమైన మలుపు అని చెప్పొచ్చు.కవిత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి తాజాగా చేసిన వ్యాఖ్యలు కేవలం భావోద్వేగ స్పందనలా కాకుండా, తనకంటూ ప్రత్యేక రాజకీయ గుర్తింపు నిర్మించాలనే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్‌ను టార్గెట్ చేయడం ద్వారా, బీఆర్ఎస్‌లోని అధికార కేంద్రాన్ని సవాల్ చేయడానికి కవిత సిద్ధమవుతున్నారనే భావన బలపడుతోంది.గులాబీ బాస్ కేసీఆర్ జగిత్యాల సభలో ప్రజలను తప్పుబట్టడం, ఉద్యమకారులకు స్థానం లేదనడం, మహిళల గౌరవాన్ని ప్రశ్నించడం వంటి అంశాలపై కవిత చేసిన వ్యాఖ్యలు కేసీఆర్ నేతృత్వంపై నేరుగా దెబ్బకొట్టేలా ఉన్నాయి. ఇవి కేవలం అసంతృప్తి వ్యక్తీకరణ కాదు, పార్టీ లోపల ఉన్న అధికార సమీకరణలను మార్చాలనే సంకేతాలుగా కూడా చదవొచ్చు.కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొంటేనే తన రాజకీయ స్థానం స్పష్టమవుతుందని కవిత భావిస్తున్నట్లు కనిపిస్తోంది. కుటుంబ రాజకీయాల్లో ఉన్న బంధం కంటే రాజకీయ స్పష్టత ముఖ్యమని ఆమె నిరూపించాలనుకుంటున్నారన్న అభిప్రాయం ఈ పరిణామాలతో బలపడుతోంది.ఈ పరిణామం బీఆర్ఎస్ అంతర్గత రాజకీయాల్లో పెద్ద మార్పుకు దారితీయొచ్చు. ఒకవేళ కవిత ఈ ధోరణిని కొనసాగిస్తే, ఇది కేవలం వ్యక్తిగత అసమ్మతి కాదు, తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి నిర్మాణానికి ఆరంభం కావచ్చు.

===========

# ఈ స్మార్ట్ యార్డులు

హైదరాబాద్, ఏప్రిల్ 23,

తెలంగాణలో ఇక స్మార్ట్ మార్కెట్‌యార్డులు అందుబాటులోకి రానున్నాయి. ఐటీ, ఏఐ సాంకేతికతల వినియోగించనున్నారు. ఇకపై మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు, లావాదేవీలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.. ఈ మేరకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి అన్ని ఏర్పాట్లు చేస్తోంది మార్కెటింగ్‌శాఖ. ముందుగా గడ్డి అన్నారం మార్కెట్‌లో ఈ కొత్త సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశ పెట్టనున్నారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డుల్లో అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్‌యార్డులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మార్కెట్ యార్డుల్లో ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా, అక్కడి కార్యకలాపాలు పూర్తి పారదర్శకంగా ఉండేలా డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 198 మార్కెట్ యార్డులు ఉంటే.. వాటిలో కార్యకలాపాలు మాన్యువల్ పద్ధతిలో కొనసాగుతున్నాయి. ప్రతి ఏటా దిగుబడి కూడా పెరుగుతుండటంతో మార్కెట్ యార్డులకు వచ్చే రైతుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇలా మార్కెట్ యార్డులకు పంట ఉత్పత్తులు ఎక్కువగా వస్తుండగా.. ఆదాయం మాత్రం పెద్దగా పెరగలేదు.మార్కెట్ యార్డులకు ఆదాయం రాకపోవడానికి కారణాలను అధికారులు పరిశీలిస్తే.. యార్డుల్లో సరుకుకు సంబంధించిన వివరాలు నమోదు సరిగా జరగడం లేదని తేలింది. కొంతమంది వ్యాపారులు రసుములు కూడా చెల్లించకుండా క్రయవిక్రయాలు చేస్తున్నారు. మాన్యువల్ కారణంగా యార్డుల్లో అక్రమాలకు అవకాశం ఏర్పడింది. చాలామంది వ్యాపారులు రూ.లక్షల్లో రుసుములు చెల్లించకుండా తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

# మత్తు,మాదక ద్రవ్యాలు బాల్య వివాహాలు నిర్మూలించాలి: సిడిపిఓ,జిల్లా సంక్షేమ అధికారి ఇంచార్జీ పి.ప్రేమలత

ఏటూరు నాగారం/ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 (భారతశక్తి) : మత్తు మాదక ద్రవ్యాలుబాల్య వివాహాలు రెండింటి నిర్మూలన కోసం అంతా ఓ ఉద్యమంలా కదలాలి, క్రమశిక్షణాయుతమైన జీవన శైలితోనే యువత ఎదగాలని జిల్లా సంక్షేమ అధికారి ఇంచార్జి పి. ప్రేమలత తెలిపారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ప్రత్యేక కార్యాచరణ లో భాగంగా గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని టీజీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ స్పోర్ట్స్ (బాయ్స్), జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగము –ములుగు ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు మాదకద్రవ్యాల నిషేధం, వివిధ బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిసిపియుప్రొటెక్షన్ అధికారి హరికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా సంక్షేమ అధికారిణి ఇన్చార్జి పి. ప్రేమలత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ రహిత జిల్లాగా మన ములుగు జిల్లాను తీర్చిదిద్దడం కోసం స్త్రీ – శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) సూచన మేరకు ఈ అవగాహన కార్యక్రమాలను గ్రనివహించడం జరుగుతున్నదని తెలిపారు. డ్రగ్స్ అనేవి మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని అవి ఆనంద కారకాలు కాదని, అవి ప్రమాదం మాత్రమే కాకుండా ప్రాణాంతకం అని అన్నారు. మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం వలన వాటిని వినియోగించే వారు సమాజంలో వావి వరుసలు మరచి మృగంలా మారే ప్రమాదం ఉందని అన్నారు. అలాగే టెక్నాలజీ ఎంత చేతిలో ఉన్నా, దాన్ని సరైన దిశలో వినియోగించే విధానం తెలియకపోతే అది మన జీవితాలను వినాశకరం చేస్తుందని అన్నారు. కావున వేసవికాల సెలవుల్లో విద్యార్థులు సెల్ ఫోన్ ను వినియోగించి అనవసరమైన వ్యాపకాలపై దృష్టి పెట్టకుండా ఏదైనా కొత్త విషయాలను వినూత్నం గా నేర్చుకునే ప్రయత్నం చేయాలని ఎదగాలని సూచించారు. వేసవికాలం సెలవుల్లో బయట తిరగవద్దని, వడదెబ్బ తగిలి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని జాగ్రత్తలు చెప్పారు. అదేవిధంగా పోషణ పఖ్వాడా లో భాగంగా పోషకాహార ప్రాధాన్యాన్ని కూడా పిల్లలకు వివరిచారు.:జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న మాట్లాడుతూ పిల్లలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న వివిధ బాలల సంక్షేమ పథకాలను గూర్చి వివరించారు. బాలికల సంరక్షణ, వారికి చదువు, వారి అభివృద్ధి ఇలా వారికి అన్ని రంగాల్లో సమ ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరాన్ని గూర్చి " భేటీ బచావో – భేటీ పడావో" కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా తెలిపారు. విద్యార్థులతో డ్రగ్స్ నిర్మూలన కొరకు కట్టుబడి ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ తీశారు.ఈ కార్యక్రమంలో టి జి టి డబ్ల్యూ ఆర్ ఎస్ స్పోర్ట్స్ (బాలురు), జడ్.పి.హెచ్.ఎస్ ఏటూరునాగారం పాఠశాలల ప్రిన్సిపాల్ లు వాసం సాంబశివరావు, బానోత్ రాజు నాయక్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# చదువులో రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి: సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల, ఏప్రిల్ 23 (భారతశక్తి ప్రతినిధి):

రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలో ల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పౌష్టిక ఆహారం ఇవ్వాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన– ప్రగతి నివేదనలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంక్షేమ వారోత్సవాల్లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మంత్రి అల్పాహారం చేశారు. రాష్ట్రంలో ని ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయ సాధన లో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి ఈ సందర్భంగా విద్యార్థులను కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టిక ఆహారం అందించాలని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నిర్ణయించారని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి హాస్టల్లో పౌష్టిక ఆహారం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు పెంచడం జరిగిందని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందించడానికి చర్యలు చేపట్టామని మంత్రి వివరించారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నిజం చేస్తూ ప్రభుత్వా లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని చదువులో రాణించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

ఈసందర్భంగా విద్యార్థులు వెల్లడించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్, ఆర్డీవో మధుసూదన్, డీసీసీ అధ్యక్షులు నందయ్య, కౌన్సిలర్లు దుమాల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్డీస్ కళ్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి పొంగులేటి



మణుగూరు, ఏప్రిల్ 23 (భారతశక్తి): రెడ్డీస్ కళ్యాణ మండపం నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు. మండల పరిధిలోని తొగ్గూడెం గ్రామ పంచాయితీ, రైల్వేస్టేషన్ సమీపంలో మణుగూరు రెడ్డీస్ సంక్షేమ సమాఖ్య అధ్యక్షులు వాసిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణ మండపం నిర్మాణం చేయుటకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ సంధర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమాజం అభివృద్ధి దిశగా అడుగులు వేయాలంటే ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యత కలిగిస్తాయని తెలిపారు. కళ్యాణ మండపం ద్వారా సామాజిక, సాంస్కృతిక, శుభకార్యాలకు మంచి వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. రెడ్డీస్ సమాఖ్య సభ్యులను అభినందిస్తూ, భవన నిర్మాణం నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మణుగూరు ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సమాజ ఐక్యతకు, సామూహిక కార్యక్రమాలకు ఈ కళ్యాణ మండపం ఒక కేంద్రంగా నిలుస్తుందని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని సదుపాయాలతో నిర్మించాలని ఆకాంక్షించారు. రెడ్డీస్ సంక్షేమ సమాఖ్య చేపట్టిన ఈ శుభకార్యాన్ని అభినందిస్తూ, నిర్మాణ పనులకు తన సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, గ్రామ సర్పంచ్ లు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, కాంగ్రెస్ నాయకులు, రెడ్డీస్ సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడికి నివాళులర్పించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి



రేగొండ, ఏప్రిల్ 23 (భారత శక్తి) భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాకపల్లె గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు కంజుల రాజన్న నిన్న సాయంత్రం పరమపదించారు.

ఈ రోజు వారి పార్థివ దేహంపై భారతీయ జనతా పార్టీ జెండాను కప్పి నివాళులర్పించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి చందుపట్ల కీర్తి రెడ్డి అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతి రెడ్డి , బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గాలీఫ్, నాయకులు నరహరి, నందయ్య, తిరుపతి, ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జనగణన సమర్థవంతంగా నిర్వహించాలి: జిల్లా ప్రణాళికా అధికారి ఎం. ప్రకాష్.



ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 (భారత శక్తి): జనగణన–2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియసమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి ఎం. ప్రకాష్ ఎన్యుమరేటర్స్/సూపర్ వైజర్లు కు తెలిపారు. మున్సిపాలిటీ ములుగు జనగణన, ఇండ్ల గణన శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ములుగు లో ప్రారంభించారు. అనంతరం ప్రకాష్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, మొత్తము 33 ప్రశ్నలతో కూడిన వివరాలు ఉంటాయని ప్రతి ప్రశ్నకు తగిన సమాధానాన్ని సరిగా నమోదు చేయాలన్నారు. తొలుత మే 11 నుంచి జూన్ 9 వరకు సర్వే చేపడతామని ఆ తర్వాత రెండో విడత 2027 ఫిబ్రవరిలో జనాభా గణన సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గణన చేయాలని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ములుగు మున్సిపాలిటీ కమిషనర్ రమేష్ ఇంచార్జ్ అధికారిగా వ్యవహరిస్తారు.

ఏ.మధుసూదన్, డి. వెంకటేశ్వర్లు పర్యవేక్షకులకు శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో భూక్య లాల్, గణాంకాధికారి, హమీద్, మాస్టర్ ట్రైనర్ పాల్గొన్నారు.

# లింగంపేట గురుకుల పాఠశాలలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం

**–విద్యార్థుల ప్రగతి పత్రాలను పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**–తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి: కలెక్టర్**

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 23: మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాల (బాలుర), లింగంపేట నందు 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థుల ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "మహాత్మా జ్యోతిబాపూలే ఆశయ సాధనకు గురుకులాలు ఎంతో కృషి చేస్తున్నాయి. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పిస్తున్న ఉపాధ్యాయులకు అభినందనలు'' అని అన్నారు."విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తేనే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుంది. పిల్లలపై నిరంతరం దృష్టి సారించి, వారి సందేహాలను నివృత్తి చేయాలి'' అని సూచించారు."ప్రభుత్వం గురుకులాల ద్వారా అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి. మీరంతా కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని నా ఆకాంక్ష'' అని విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ అన్నారు.



ప్రగతి పత్రాల ద్వారా విద్యార్థుల బలాలు, బలహీనతలు తెలుసుకొని, మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ, ఎంపీడీఓ, ఆర్సీఓ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 26వ తేదీన అధికారికంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 23:

వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షనీయమని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవి మహా సంస్థాన్ చైర్మన్ తోపాజి అనంత కిషన్ తెలిపారు. వాసవి మహా సంస్థాన్ పాలకవర్గ సమావేశం గురువారం ఆర్యవైశ్య భవనంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 26వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రభుత్వ అతిథిగం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. కలెక్టర్ కార్యాలయం ఆడిటోరియంలో అధికారికంగా నిర్వహించి వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈల్లింతల రాజు, కోశాధికారి జూలకంటి మల్లేశం, కార్య నిర్వాహక కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు ఆమెటి మహేందర్ సభ్యులు పాల్గొన్నారు.

# అయ్యపల్లి పీపీసీ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 23: కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం లింగంపేట మండలం అయ్యపల్లి గ్రామంలోని ఐకేపీ పీపీసీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.



ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి, కొనుగోలు కేంద్రంలో వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తూకం, తేమ శాతం పరీక్ష, గన్నీ బ్యాగుల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

అనంతరం వరి సేకరణకు సంబంధించిన సివిల్ సప్లైస్, మార్కెటింగ్, ఐకేపీ, పీఏసీఎస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, “రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలి” అని అధికారులను ఆదేశించారు.

“కొనుగోలు చేసిన వెంటనే రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలి. దీని కోసం ప్రతి రోజు జరిగే కొనుగోళ్ల వివరాలను అదే రోజు ఓపిఎమ్ఎస్ ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. నమోదులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు” అని హెచ్చరించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టుదల, సంకల్పానికి నిలువెత్తు నిదర్శనం అపర భగీరథ మహర్షి: ఇంచార్జి డిఆర్ఓ వేంకటపతి



వైయస్సార్ కడప జిల్లా, ఏప్రిల్ 23(భారత శక్తి ) : భగీరథ మహర్షి పట్టుదల, సంకల్పానికి నిలువెత్తు నిదర్శనమని, లక్ష్య నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని ఆయన జీవిత సారాంశం తెలుపుతుందని ఇంచార్జి డిఆర్ఓ వేంకటపతి అన్నారు.గురువారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి డిఆర్ఓ వేంకటపతి మాట్లాడుతూ ఆశయ సాధన, అకుంఠిత దీక్ష, పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం అపర భగీరథ మహర్షి అని కొనియాడారు. మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయం అన్నారు. భగీరథ మహర్షి మహాజ్ఞాని అని, పరోపకారానికి పెట్టింది పేరని, దీక్షా, సహనానికి ప్రతిరూపమని, ఎంతటి కష్టాన్నినైనా లెక్కచేయకుండా అనుకున్నది సాధించే గుణం గల వారిని ఆయన అన్నారు. ఏదైనా పనిని సంకల్పించినప్పుడు అపర భగీరథునితో పోలుస్తారన్నారు. వజ్ర సంకల్పంతో లక్ష్యాలను సాధించాలని భవిష్యత్ తరాలకు భగీరథ మహర్షి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని మనందరం కూడా ఆయన బాటలో నడవాలని కోరారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అపర భగీరథ మహర్షి యొక్క అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఇన్ని సంవత్సరాలు గడిచినా మహనీయులను, గొప్పవారిని మర్చిపోకుండా భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోష దగ్గ విషయమన్నారు. ఎంత కష్టమైన పనినైనా విజయం సాధించడంలో అపర భగీరథ మహర్షికే చెల్లిందని ప్రశంసించారు.

పలువురు బీసీ, సగర, సంఘం సభ్యులు మాట్లాడుతూ భగీరథ మహర్షి సేవానిరతి గొప్పదని, దేశం గర్వించదగ్గ మహనీయులలో ఆయన ఒకరని కొనియాడారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాగు నీరందించాలనే గొప్ప ఆశయంతో నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించి అపర భగీరధుడయ్యారని గుర్తు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో మరుగున పడిన మహనీయుల ఆశయాలను, భావాలను ఈనాటి యువతరానికి తెలియజేయాలని ఇటువంటి కార్యమాలను చేపట్టడం హర్షణీయమన్నారు. దృఢ సంకల్పం ఉంటే ఎంత కష్టతరమైన పనైనా సాధించవచ్చునని భగీరథ మహర్షిని చరితం ద్వారా మనం నేర్చుకోవాలన్నారు. అంతేకాకుండా పట్టుదల, కష్టానికి మారు పేరుగా గుర్తింపబడిన సగర వంశం, ఉప్పర జాతి ఆవిర్భావం, భగీరథ జీవిత సారాంశాన్ని వారు క్షుణ్ణంగా వివరించారు. ముందుగా భగీరథ మహర్షి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎస్ క్రిష్ణ, యాదవ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ యాదవ్, నగర సంఘం సలహాదారు వెంకటయ్య,జిల్లా సగర సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు,జిల్లా ఉప్పర జిల్లా అధ్యక్షులు సానే శ్రీనివాసులు, సగర కమ్యూనిటీ సభ్యులు అనురాధ,వివిధ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రతినిధులు, పలువురు బీసీ, సగర,ఉప్పర కుల సంఘ నాయకులు, కలెక్టరేట్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

## -ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరేలా సకల సదుపాయాలు కల్పిస్తున్నాం


## -మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




మణుగూరు, ఏప్రిల్ 23 (భారతశక్తి): విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని లంక మల్లారం గ్రామంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేసి, టీటీఆర్‌జేసీ బాలికల డార్మెటరీ హాల్‌ను ప్రారంభించారు. ముందుగా రూ.1 కోటి అంచనా వ్యయంతో ప్రధాన బీటీ రహదారి నుండి పాఠశాల వరకు అప్రోచ్ బీటీ రహదారి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇటీవలే రూ.2 కోట్లు 70 లక్షల వ్యయంతో బాలికల వసతి గృహాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. పేదవారి పిల్లలు కూడా ధనికుల పిల్లలతో సమానంగా చదువుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. విద్య పట్ల ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు అనేక నిదర్శనాలు ఉన్నాయని వివరించారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా మంచి ఆహారం తీసుకుంటూ, మెరుగైన విద్యను అభ్యసించాలనే ఆశయంతో ప్రభుత్వం హాస్టళ్లలో ఉన్న బాలబాలికలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తోందన్నారు. ఇంటి వద్ద తల్లులు చేసే వంటల రుచిని గుర్తు చేసేలా పోషకాహారంతో కూడిన మెనూను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ అందించే ఆహారం స్పష్టమైన ప్రణాళికతో హాస్టళ్లలో సకల సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల భవిష్యత్తుపై పూర్తి విశ్వాసంతో ఉందని, వారు తమ కాళ్ల మీద నిలబడి దేశాన్ని, ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదగగలరని నమ్ముతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఎవరికీ చదువు ఆగిపోకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.65 కోట్ల వ్యయంతో ఏ టీ సి కేంద్రాల ద్వారా వివిధ నైపుణ్యాలపై శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ఎలక్ట్రిషియన్, మెకానిక్ వంటి రంగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు. ఈ శిక్షణల ద్వారా వారు స్వయం ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. వైద్య రంగంలో కూడా పేదవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నామని చెప్పారు. పేదల పక్షపాతిగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు. ప్రభుత్వం మీ కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో శాతం వంద ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్, సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వ తరఫున హృదయపూర్వకంగా అభినందించారు. ఇదే విధంగా భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తోందన్నారు. పినపాక నియోజకవర్గంలో కూడా ఈ పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంతో పాటు గిరిజన అభివృద్ధి కోసం అదనంగా 1000 ఇళ్లు మంజూరు చేసి, నియోజకవర్గంలోని 380 గ్రామాలకు సుమారు 4500 ఇళ్లు ఆమోదించామని వివరించారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నామని, “అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ” ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ డైట్ ఛార్జీలు పెంచి పోషకాహారం అందిస్తున్నదన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించబడుతున్నాయని, ఈ అవకాశాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక --99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఫర్నిచర్ వంటి వసతులను పూర్తి స్థాయిలో కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్లాసులు నిర్వహించి విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో శిక్షణ అందించనున్నామని తెలిపారు. పేరెంట్స్ మీటింగ్స్ ద్వారా తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుతూ, విద్యార్థుల డ్రాప్‌ఔట్ రేటును తగ్గించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ మాట్లాడుతూ, ఈ విద్యాసంస్థలో ప్రస్తుతం 584 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. 16 గదులతో నిర్మించిన కొత్త డార్మెటరీ ద్వారా సుమారు 600 మందికి వసతి కల్పించగల సామర్థ్యం ఏర్పడిందన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉందని, ఐఐటీ తదితర ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గిరిజన గురుకుల విద్యాసంస్థల అభివృద్ధికి ప్రభుత్వం రూ.53 కోట్లు మంజూరు చేయగా, భద్రాచలం ఐటీడీఏకు రూ.6 కోట్లు, ఈ పాఠశాలకు రూ.25 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. గిరిజన పాఠశాలల్లో కూడా డిజిటల్ తరగతులు నిర్వహించేలా తగిన సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి ని కోరారు. ఈ కార్యక్రమం లో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గ్రామ సర్పంచ్ పూనెం రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాముల శైలజకు ఉమెన్ లీడర్ షిప్ ఇంటర్నేషనల్ అవార్డు

## -బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్న శైలజ



రేగొండ, ఏప్రిల్ 23 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన శ్రీరాముల శైలజకు ఉమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డు దక్కింది. బహుజన సాహిత్య జాతీయ అకాడమీ ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర కాన్ఫరెన్స్ హైదరాబాద్ నగరంలోని సుందరయ్య కళా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సమాచార కమిషనర్ దేశాల భూపాల్, తహశీల్దార్ల అసోసియేషన్ మహిళా రాష్ట్ర అధ్యక్షులు పొడపంగి రాధా, ప్రముఖ రచయిత గాయకులు గిద్దె రామ్ నర్సయ్య లు పాల్గొన్నారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా శ్రీరాములు శైలజ ఉమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డు అందుకున్నారు . అవార్డు అందుకున్న శ్రీరాముల శైలజ జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండి మండలం కొడవటంచ జోగయ్యపల్లె గ్రామానికి చెందినవారు. శైలజ మహిళా సంఘాల్లో చురుగ్గా పనిచేస్తూ మహిళలను అన్ని రంగాల్లో చైతన్య పరుస్తూ పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని అదేవిధంగా జోగయ్యపల్లె గ్రామపంచాయతీ 9 వ వార్డులో వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కూడా అయ్యారు. ఆమె పనితనాన్ని గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఆమెకు ఉమెన్ లీడర్ షిప్ నేషనల్ అవార్డు అందించారు. ప్రతి ఏటా సామాజికంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రతి ఒక్కరినీ గుర్తించి అవార్డులను అందించడం జరుగుతుందని రాధాకృష్ణ తెలిపారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించడం బహుజన సాహిత్య అకాడమీ ప్రత్యేకత గా పేర్కొన్నారు. శ్రీరాములు శైలజ జిల్లాలో మహిళా హక్కుల కోసం మహిళా సమస్యల మీద అనేక పోరాటాలు చేసిన ఘనత ఆమె సొంతమని అన్నారు. అవార్డు అందుకున్న శ్రీరాముల శైలజ ఈ సందర్భంగా మాట్లాడుతూ అవార్డు అందుకోవడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. సమాజంలో మరింత సేవ అందించేందుకు తనకు మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. ఆమెను పలువురు వక్తలు అభినందించారు. ఈ అవార్డు అందించిన జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు విష్ణు, కార్యదర్శి కనుకుంట్ల విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు టేకి రాజ శేఖర్, బహుజన సాహిత్య అకాడమీ హైదరాబాద్ నగర్ మహిళా వింగ్ అధ్యక్షురాలు జ్యోతి, అవార్డుల కమిటీ జయశంకర్ భూపాలపల్లి సెలక్షన్ కమిటీ మెంబర్ తాటికంటి ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సినిమా




## గ్లోబల్ స్థాయిలో మెప్పించే కథ..
### 'ఏఏ 23'పై రైటర్ కామెంట్స్

వరుసగా భారీ ప్రాజెక్ట్లతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ . ఆయన హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. 'ఏఏ 23'గా అది ప్రచారంలో ఉంది. ఈ సినిమాకు సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాలను రైటర్ రత్నకుమార్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని త్వరలోనే షూటింగ్ ప్రారంభించేందుకు టీమ్ సిద్ధమవుతోందని తెలిపారు. ''ఇది కచ్చితంగా అంతర్జాతీయ ఆడియన్స్కు కూడా నచ్చుతుంది. ఇందులోని నటీనటులు, వారి పాత్రలు, సెట్స్లను చూసి నేను ఈ మాట చెప్పడం లేదు. ఇది గ్లోబల్ స్థాయిలో మెప్పించేంత గొప్ప కథ (AA23). ఈ ప్రాజెక్ట్ కోసం మూడు వారాల పాటు చర్చలు జరిగాయి. అల్లు అర్జున్తో మాట్లాడడం మా టీమ్కు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. మే రెండో వారం నుంచి పనులు మరింత వేగవంతం కానున్నాయి'' అని చెప్పారు. దీంతో సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాను ప్రకటిస్తూ పంచుకున్న స్పెషల్ వీడియో సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేసింది. ఏకంగా ఈ థీమ్ సాంగ్పై ఇన్స్టాలో వన్ మిలియన్ రీల్స్ క్రియేట్ అయ్యాయి. దీనిపై దర్శకుడు ఆనందం వ్యక్తం చేస్తూ సినిమా ఏ స్థాయిలో ఉంటుందో ఈ నంబర్లే చెబుతున్నాయన్నారు. ఇక అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో 'రాకా'లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్తో రూపొందుతున్న ఈ మూవీలో దీపికా పదుకొణె కథానాయికగా కనిపించనున్నారు. సైన్స్ ఫిక్షన్ జానర్లో దీన్ని తీర్చిదిద్దుతున్నారు.





## 'ఆదర్శ కుటుంబం'లోకి
## తమన్ ఎంట్రీ!

త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా 'ఆదర్శ కుటుంబం' తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్గా మారింది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించినప్పుడు మ్యూజిక్ డైరెక్టర్గా హర్షవర్ధన్ రామేశ్వర్ను ఎంపిక చేశారు. తాజాగా ఆయన ఈ సినిమా నుంచి వైదొలిగినట్లు వార్తలు వస్తున్నాయి.ఆయన స్థానంలో తమన్ ఎంట్రీ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రానప్పటికీ వార్త మాత్రం సోషల్ మీడియాలో తెగ షేర్ అవుతోంది. ఇటీవల విడుదలైన 'ఉస్తాద్ భగత్సింగ్'లో కూడా తమన్ చివరి నిమిషంలో భాగమయ్యారు. పాటలన్నీ దేవిశ్రీ సమకూర్చగా, నేపథ్య సంగీతం అందించే బాధ్యతని మాత్రం తమన్ తీసుకున్న విషయం తెలిసింది. దీంతో అప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్'.. ఇప్పుడు 'ఆదర్శకుటుంబం'.. అంటూ తమన్ను ఉద్దేశించి అభిమానులు పోస్ట్లు పెడుతున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) 'ఆదర్శ కుటుంబం'ని నిర్మిస్తున్నారు. 'హౌస్ నం47 (AK47)' అనేది ఉప శీర్షిక. ప్రస్తుతం చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమాలో నారా రోహిత్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. మే నాటికి చిత్రీకరణ పూర్తి చేయడమే లక్ష్యంగా టీమ్ వర్క్ చేస్తోంది. కుటుంబ భావోద్వేగాలతో ముడిపడి ఉన్న క్రైమ్ డ్రామాగా ముస్తాబవుతోంది. త్రివిక్రమ్ వెంకీ నుంచి కోరుకునే వినోదాత్మక అంశాలు పుష్కలంగా ఉండనున్నాయి.

## మెక్సికో ఈవెంట్లో 'వారణాసి' ప్రదర్శన

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి' . తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్తను ఎస్ఎస్ కార్తికేయ పంచుకున్నారు. మెక్సికోలో జరగనున్న ఓ సినీ వేడుకలో ఈ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మెక్సికో వేదికగా ఏప్రిల్ 24 నుంచి 26 వరకు జరగనున్న కామిక్ కాన్ ఎక్స్పీరియన్స్ లో 'వారణాసి'కి సంబంధించిన ఎక్స్క్లూజివ్ కంటెంట్ను ప్రదర్శించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, బిహైండ్ ది




సీన్స్తో పాటు కొన్ని కీలకమైన సన్నివేశాలతో కూడిన గ్లింప్స్ను ప్రేక్షకులకు చూపించనున్నారు. ఈ వేడుకకు కార్తికేయ హాజరుకానుండగా.. రాజమౌళి ప్రత్యేక వీడియో సందేశంతో అక్కడి అభిమానులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.



## పెద్ది కోసం
## శ్రుతిహాసన్

ప్రత్యేకగీతం మినహా 'పెద్ది' సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఇక ప్రత్యేకగీతం చిత్రీకరణకు రంగం సిద్ధమైంది. ఆ పాటలో ఆడిపాడనున్న కథానాయిక అన్వేషణ ఎట్టకేలకి పూర్తయింది. అగ్ర కథానాయిక శ్రుతిహాసన్ ఆ పాట కోసం రంగంలోకి దిగనున్నారు. మృణాల్ ఠాకూర్ మొదలుకొని పలువురు కథానాయికల పేర్లని చిత్రబృందం పరిశీలించింది. చివరికి శ్రుతిని ఖరారు చేసింది. ఈ నెల 26 నుంచే హైదరాబాద్ శివార్లలో తీర్చిదిద్దిన ప్రత్యేక సెట్లో పాటని చిత్రీకరించనున్నారు. శ్రుతిహాసన్ ప్రత్యేకగీతాల్లో ఆడిపాడటం కొత్తేమీ కాదు. ఇదివరకు 'ఆగడు' సినిమాలో 'జంక్షన్లో...' అంటూ మహేశ్బాబుతో కలిసి సందడి చేశారు. తెలుగులో ఆమె చేస్తున్న రెండో ప్రత్యేకగీతం 'పెద్ది' సినిమాలోనే. శ్రుతిహాసన్ ఇదివరకు రామ్చరణ్తో కలిసి 'ఎవడు' సినిమాలో నటించారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్చరణ్, జాన్వీ కపూర్ జంటగా రూపొందుతున్న 'పెద్ది' సినిమా జూన్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు.

## రెడ్ హ్యాండెడ్ గా
## పట్టుకుంటా!

టాలీవుడ్ సింగర్ గీతా మాధురి సాధారణంగా వివాదాలకు దూరంగా ఉంటారు. అనవసరమైన విషయాల జోలికి ఆమె వెళ్లరు. గాయకుడు నోయెల్ నిర్వహిస్తున్న యూట్యూబ్ టాక్ షోలో పాల్గొన్న ఆమె... సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. ఇంటర్వ్యూలో గీత మాట్లాడుతూ... తాను చాలా అరుదుగా కాఫీ షాపులకు వెళతానని, కానీ వెళ్ళినప్పుడల్లా ఎవరో ఒక సెలబ్రిటీ జంట తనకు అక్కడ 'రెడ్ హ్యాండెడ్'గా దొరికిపోతారని చెప్పారు. "నేను వెళ్ళిన ప్రతిసారీ ఎవరో ఒకరు నాకు దొరుకుతూనే ఉంటారు. నేను చూసిన వాటి గురించి ఇప్పుడు నోరు విప్పితే చాలా మంది కాపురాలు కూలిపోవడం ఖాయం" అని ఆమె నవ్వుతూనే సంచలన విషయాన్ని వెల్లడించారు. ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె చూసిన ఆ 'సీక్రెట్ కపుల్స్' ఎవరు? వారు టాలీవుడ్ ప్రముఖులేనా? అని సోషల్ మీడియాలో నెటిజన్లు తెగ వెతికేస్తున్నారు.



## మంగ్లీ భరోసా:
## బాధితులకు అండగా ఉంటా



అధిక వడ్డీ ఆశ చూపి అమాయక ప్రజల నుంచి వందల కోట్ల రూపాయలు వసూలు చేసిన అంశం తెలంగాణను కుదిపేస్తోంది. ఈ ఆర్థిక మోసం కేసులో ప్రముఖ సింగర్ మంగ్లీపై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుతో తనకు సంబంధం లేదని మంగ్లీ పలుమార్లు తెలిపారు. తాజాగా ఆమె మరోసారి స్పందించారు. ఈ కేసులో కావాలనే తన పేరును తెరపైకి తీసుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, కొంతమంది తన వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. బాధితులకు కూడా న్యాయం జరిగే వరకు తాను వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సినిమా ఫైనాన్సింగ్ సంస్థ పేరుతో నెలకు 3 నుంచి 5 శాతం వడ్డీ ఇస్తామని నమ్మించి 150 మంది నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. మంగ్లీ తనకు ఉన్న పాపులారిటీని ఉపయోగించి ఇందులో డబ్బులు పెట్టేలా ప్రోత్సహించారని, ఆమె సోదరుడు శివ కూడా ఇందులో భాగస్వామి అని బాధితుల తరపు న్యాయవాది సుబ్బారావు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో మంగ్లీతో పాటు ఆమె సోదరుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# రాజకీయ కక్షసాధింపుపై 'న్యాయ' విజయం!

* కేసీఆర్‌పై విమర్శలు తగవు.. హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి హెచ్చరిక
* ప్రాజెక్టుల మరమ్మతులు గాలికి వదిలేశారు: సబితా ఇంద్రారెడ్డి ధ్వజం



మహేశ్వరం, ఏప్రిల్ 23 (భారత శక్తి) : ప్రభుత్వాలు అధికార అహంకారంతో, రాజకీయ ప్రతీకారంతో వ్యవహరిస్తూ కేసులు పెట్టే ధోరణికి హైకోర్టు తీర్పు ఒక గట్టి హెచ్చరిక అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మహేశ్వరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ ఎలాంటి తప్పు చేయలేదని న్యాయస్థానం స్పష్టం చేయడంతో తమ నమ్మకం బలపడిందని, తెలంగాణ ప్రజలు ఇప్పటికే ఈ విషయాన్ని గుర్తించారని ఆమె అన్నారు.

**అభివృద్ధికి కేసీఆర్ కేరాఫ్ అడ్రస్**

తెలంగాణ ఏర్పడక ముందు ఈ ప్రాంతంపై ఎన్నో అనుమానాలు ఉండేవని, కానీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రాష్ట్రం అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కిందని సబితా గుర్తు చేశారు. ఏ చర్చ జరిగినా గంటల తరబడి రైతుల సంక్షేమం గురించే ఆలోచించే గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరం ద్వారా రైతులకు నీరు అందించాలనే సంకల్పంతో అద్భుత నిర్మాణాలు చేపట్టారని తెలిపారు.

**నిర్లక్ష్యం వీడాలి.. మరమ్మతులు చేపట్టాలి**

కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్షల కోట్ల అవినీతి జరిగిందంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని ఆమె ఖండించారు. "భారీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు ఖర్చులు సహజంగానే ఎక్కువగా ఉంటాయి. వాటిని సద్వినియోగం చేసుకోవడం మానేసి, ప్రాజెక్టులు కూలిపోవాలని కోరుకోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యం" అని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీలో దెబ్బతిన్న భాగాలను మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చినా, ప్రభుత్వం నిబంధనల పేరుతో అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు.

**గతం వైభవం.. నేడు దుస్థితి**

2014 తర్వాత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో రికార్డు స్థాయిలో పంటలు పండాయని, కానీ నేడు కాంగ్రెస్ హయాంలో పరిస్థితి తలకిందులైందని సబితా ఆవేదన వ్యక్తం చేశారు.

* నీటి కష్టాలు: మిషన్ భగీరథ నిర్వహణ సరిగా లేక గ్రామాల్లో తాగునీటి ఎద్దడి మొదలైంది.
* కరెంట్ కోతలు: గతంలో 24 గంటల ఉచిత విద్యుత్ ఉండేదని, ఇప్పుడు గంటల తరబడి పవర్ కట్స్ పెడుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు.
* పథకాల నిలిపివేత: రైతు బంధు, రైతు బీమా వంటి పథకాల అమలులో జాప్యం చేస్తూ అన్నదాతలను ప్రభుత్వం వంచిస్తోందని ఆరోపించారు.

**ప్రభుత్వానికి డిమాండ్లు:**

1. మేడిగడ్డ బ్యారేజీకి తక్షణమే మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలి.
2. మిషన్ భగీరథను సమర్థంగా నిర్వహించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.
3. కోతల్లేని నిరంతర విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి.
4. రైతు సంక్షేమ పథకాలను ఎటువంటి ఆంక్షలు లేకుండా వెంటనే అమలు చేయాలి.

న్యాయస్థానం తీర్పు రాజ్యాంగ విలువలను కాపాడే సంకేతమని, ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ కక్షలను పక్కన పెట్టి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆమె డిమాండ్ చేశారు.



# సర్కారు నిర్లక్ష్యంతోనే ఆర్టీసీ సమ్మె

**: దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**

ఎల్బీనగర్, ఏప్రిల్ 23 (భారత శక్తి): కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ మొండి వైఖరికీ నిరసనగా దిల్ సుఖ్ నగర్ సిటీ డిపో వద్ద ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, మేనిఫెస్టోలో పెట్టిన ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించి, ప్రభుత్వ నిర్లక్ష్యం, బాధ్యతారహితం కారణంగానే ఉద్యోగులు సమ్మెకు దిగారన్నారు. సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని వారి కోరికలు నెరవేర్చి సమ్మె విరమించేలా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ భారాస పార్టీ యువ నాయకులు సొంటి చంద్రశేఖర్ రెడ్డి, ఆర్టీసీ యూనియన్ నాయకులు, మహిళ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దుద్దేడలో ఘనంగా శ్రీ చౌడాలమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం



సిద్దిపేట, ఏప్రిల్ 23 (భారత శక్తి) : సిద్దిపేట జిల్లా దుద్దేడ గ్రామంలో గోపికృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ చౌడాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురువారం రోజు ఆలయంలో అమ్మవారి కల్యాణ మహోత్సవం నిర్వహించి అమ్మవారికి భక్తులు అమ్మవారికి వడిబియ్యం బోనాలు సమర్పించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు.ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ శ్రీ చౌడాలమ్మ తల్లి అనుగ్రహంతో అందరూ బాగుండాలని కోరుకుంటూ.. శ్రీ చౌడాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులు నూనె కుమార్ యాదవ్, యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల రాజు, గొల్ల కుల పెద్ద జక్కుల కొమురయ్య, మరియు యాదవ సంఘం నాయకులు భక్తులు, మహిళలు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## భర్తతో గొడవపడి వచ్చిన మహిళ
# సరూర్ నగర్ లో అదృశ్యం



ఎల్బీనగర్, ఏప్రిల్ 23 (భారత శక్తి): సరూర్ నగర్ డివిజన్ పంజాల అనీల్ కుమార్ కాలనీలో నివాసం ఉండే మేడమోని యాదమ్మ అనే మహిళ కూతురు వంగూరి శ్రీలత (28) భర్త శ్రీశైలంతో గొడవపడి అమ్మ వారి ఇంటికి వచ్చింది. పిల్లలను వదిలి రావడం మంచిది కాదు నీ భర్తను సంజాయించి భర్కత్ పల్లిలో మీ ఇంటి కాడ వదిలి వస్తానని తల్లీ యాదమ్మ నచ్చ చెప్పింది.సరే అని

# ఆర్టీసీ సమ్మెపై ముఖ్యమంత్రి స్పందించాలి

* గజ్వేల్ సీపీఐ నాయకులు



గజ్వేల్, ఏప్రిల్ 23: (భారత శక్తి) : ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్సు డిపో ముందు ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ నాయకులు సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికులకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఆర్టీసీ కార్మికులు కీలక పాత్ర పోషించారని వారు గుర్తు చేశారు. కార్మికులను చర్చలకు పిలవకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని, గతంలో కార్మికులతో ఘర్షణ పడ్డ ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని హెచ్చరించారు. తక్షణమే ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, నియోజకవర్గ ఇన్చార్జి శివలింగ కృష్ణ, పార్టీ నాయకులు, ఆర్టీసీ జేఏసీ నాయకులు మరియు కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# భైంసాలో ఇండియన్ గ్యాస్ కొరత లేదు

: **ఇండియన్ కృప గ్యాస్ మేనేజర్ అజయ్ పాటక్**







నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(భారత శక్తి ) భైంసా పట్టణంలో గ్యాస్ కొరత ఉందన్న వార్తలు అసత్యమని ఇండియన్ కృప గ్యాస్ మేజర్ అజయ్ పాటాక్ తెలిపారు. పట్టణంలో గ్యాస్ కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని, సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో గ్యాస్ సరఫరా నిలిచిపోయిందనే అపోహలు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రజలు అవి నమ్మవద్దని సూచించారు. ఇండియన్ గ్యాస్ సంస్థ తరఫున వినియోగదారులకు సమయానికి సిలిండర్లు అందిస్తున్నామని, ఎటువంటి కొరత లేదని తెలిపారు. అదేవిధంగా వినియోగదారులు గ్యాస్ బుకింగ్ చేసి, బుకింగ్ కన్ఫర్మేషన్ మెసేజ్ వచ్చిన తర్వాత గ్యాస్ బుక్ పుస్తకం మరియు మొబైల్ ఫోన్‌తో కార్యాలయానికి రావాలని సూచించారు. ప్రజలు అనవసర ఆందోళనలకు గురికాకుండా, గ్యాస్ సరఫరా ప్రక్రియలో సహకరించాలని మేజర్ అజయ్ పాటాక్ కోరారు.

# మామిడి ఎగుమతులతోనే రైతులకు అధిక లాభాలు

* శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీలో 'ఎగుమతి ఉత్పాదకత'పై అతిథి ఉపన్యాసం






గజ్వేల్ , ఏప్రిల్ 23 (భారత శక్తి ) : అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మామిడి సాగు చేపట్టినప్పుడే రైతులకు ఆశించిన లాభాలు అందుతాయని నిపుణులు పేర్కొన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో "ఎగుమతి దృష్టితో మామిడి ఉత్పత్తి" అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. నాణ్యతే అంతర్జాతీయ మార్కెట్ సూత్రం ఈ కార్యక్రమానికి APEDA (అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రతినిధులు ఏజీఎం శ్రీ ఆర్. పి. నాయుడు, బీడీఎం శ్రీ బాషా ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన గ్లోబల్ గ్యాప్ ప్రమాణాలను రైతులు పాటించాలి. పంటలో పురుగుమందుల అవశేషాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎగుమతులకు కీలకం. సరైన గ్రేడింగ్, ఆధునిక ప్యాకింగ్, మరియు కోల్డ్ చైన్ నిర్వహణపై రైతులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎగుమతికి అవసరమైన ధృవపత్రాలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ రాయితీలను వారు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీన్ డాక్టర్ జె. చీనా నాయక్ మాట్లాడుతూ రైతులు సంప్రదాయ పద్ధతులను వీడి, వ్యాపార దృక్పథంతో సాగు చేయాలని సూచించారు. కార్యక్రమ అధ్యక్షత వహించిన డా. డి. విజయ మాట్లాడుతూ సాంకేతిక జ్ఞానంతోనే అధిక ఆదాయం సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని డా. వి. సుచిత్ర సమన్వయం చేయగా.. అధ్యాపకులు డా. జి. సతీష్, బి. చంద్రశేఖర్, సింధుజ, పరిపాలనా అధికారి తులాసిరానితో పాటు పెద్ద సంఖ్యలో రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# ఓటరు మ్యాపింగ్‌కు 'హెల్ప్ డెస్క్'లు ప్రారంభం

* **హైకోర్టులో ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు**

హైదరాబాద్ ఏప్రిల్ 23(భారతశక్తి): ఎన్నికల ప్రక్రియను సులభతరం చేసేందుకు, ఓటర్లకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో జీహెచ్ఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎన్నికల అధికారి (డీఈఓ) ఆర్.వి.కర్ణన్ ఆదేశాల మేరకు.. అన్ని వర్గాల ఓటర్ల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో 'హెల్ప్ డెస్క్'లను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ హైకోర్టులో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం కింద 2002-2025 ఓటర్ల మ్యాపింగ్ కోసం ప్రత్యేక కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు.

* **మ్యాపింగ్ చేసుకున్న న్యాయవాదులు**

అదనపు కమిషనర్ (ఎన్నికలు) కె.చంద్రకళ, చార్మినార్ ఈఆర్ఓ సరిత ఈ హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా పలువురు న్యాయవాదులు తమ ఓటు వివరాలను సులభంగా మ్యాపింగ్ చేసుకున్నారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సురేందర్ రెడ్డి, ఇతర సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని అధికారులకు సహకరించారు.

* **అన్ని సంఘాల్లోనూ కేంద్రాలు***

మరింత విస్తృతంగా సేవలు అందించేందుకు జీహెచ్ఎంసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగర పరిధిలోని రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఉద్యోగ సంఘాల కార్యాలయాలు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్లలోనూ ఇలాంటి హెల్ప్ డెస్క్‌లను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(భారత శక్తి): ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్మల్ గ్రామీణ మండలం, ద్యాంగాపూర్ ప్రభుత్వ బాలుర ఆశ్రమం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల, పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ కు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. ముందుగా పాఠశాలలోని సరస్వతి అమ్మవారి విగ్రహానికి కలెక్టర్, అధికారులు, పోషకులు కలిసి పూజలు



చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంక్షేమ వారోత్సవాలు నిర్వహించుకుంటున్నామని అన్నారు. పోషకులు, తల్లిదండ్రుల సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సమావేశాల వల్లనే పాఠశాల ప్రగతి ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రగతి వివరాలు కూడా ఈ సమావేశాల వల్ల తల్లిదండ్రులకు తెలుస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కలవడం వల్ల పాఠశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆస్కారం ఉంటుందన్నారు. విద్యార్థులు అందరూ సెలవులు ముగియగానే సమయానికి పాఠశాలకు రావాలని అన్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో చొరవ చూపాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రహరీ గోడ సమస్య తొలగిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థుల నీటి సౌకర్యానికై బోరు వేస్తామని చెప్పారు. ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు అన్ని నైపుణ్యాలు, అర్హతలు ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన అందించబడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని వివరించారు. కామన్ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న పిల్లలందరూ చదువులు, ఆటల్లో అద్భుత ప్రతిభ చాటుతున్నారని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులకు వార్షిక ప్రగతి నివేదికలు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన, క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి, బహుమతులు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో డిటిడిఓ అంబాజీ, డీఈవో భోజన్న, సిపిఓ జీవరత్నం, తహసిల్దార్ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, గ్రామసర్పంచ్, ఉప సర్పంచ్ లు నవీన్, హరీష్, ఇతర అధికారులు, విద్యార్థుల పోషకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు భైంసా పట్టణంలోని ఆరాధన హాస్పిటల్ లో ఉచిత వైద్య శిబిరం

: **డాక్టర్ రాజారెడ్డి**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(భారత శక్తి):భైంసా పట్టణంలోని ఆరాధనా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. ముధోల్ నియోజకవర్గ ప్రజలకు శుభవార్తగా, గత 27 సంవత్సరాలుగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ఆరాధనా హాస్పిటల్ ఇటీవల నూతన భవనంలోకి మారిన సందర్భంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉచిత మెడికల్ క్యాంప్ 24042026 శుక్రవారం ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించబడుతుంది. ఈ శిబిరంలో డాక్టర్ కన్సల్టేషన్ (ఒపీ ) ఫీజు పూర్తిగా ఉచితం. అదేవిధంగా ఎక్స్రే, ఈసీజీ (ఈసీజీ ), బీఎండీ (బోన్ మినరల్ దేన్సిటీ ) పరీక్షలు, యూఎస్జీ స్కాన్ (అబ్డొమెన్, టీవీఎస్ ), పీఎఫ్టీ వంటి పలు ముఖ్యమైన వైద్య పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించబడతాయి. భైంసా పట్టణంతో పాటు




పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి వైద్యులు, ముఖ్యంగా డాక్టర్ రాజారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా మహర్షి భగీరథ జయంతి వేడుకలు

* **భగీరథుని కృషి స్ఫూర్తిదాయకం : జిల్లా కలెక్టర్**

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 23: జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం మహర్షి భగీరథ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "మహర్షి భగీరథుడు తన పట్టుదల, అకుంఠిత దీక్షతో గంగానదిని భువికి తెచ్చి లోక కల్యాణం చేశారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఆయన కృషి నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు. "భగీరథుని వలె మనమందరం సమాజ హితం కోసం నిస్వార్థంగా పనిచేయాలి. ముఖ్యంగా ప్రభుత్వ



అధికారులు, సిబ్బంది భగీరథుని ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. జల సంరక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ విషయాల్లో భగీరథుని స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సగర పుత్రులకు ముక్తిని కలిగించడం కోసం తరతరాలుగా చేసిన తపస్సును కొనసాగించి విజయం సాధించిన భగీరథుని సంకల్పం అందరికీ ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, ఏ సి ఎల్ బి మధు మోహన్ . జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జయరాజ్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి చక్రధర్ , పవన్, సునీత, అశ్వక్, జీవన్, శాంతయ్య తదితరులు, జిల్లా అధికారులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత సామాజిక బాధ్యత

* **పరిశోధనాంశాలను వివరించిన సైకాలజీ అధ్యాపకురాలు డాక్టర్ అఫ్రిన్ వసీం**

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, ఏప్రిల్ 23 : మహిళలు భయం లేకుండా స్వేచ్ఛగా జీవించగల వాతావరణాన్ని సృష్టించడానికి సామూహికంగా బాధ్యత వహించాలని గీతంలోని అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అఫ్రీన్ వసీం అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 'పరిశోధన చర్చల' శ్రేణిలో భాగంగా ఐదవ సెమినార్ ను గురువారం నిర్వహించింది. భయంలో జీవించడం: భారతదేశంలోని మహిళలపై లైంగిక హింస ముప్పు యొక్క మానసిక ప్రభావం' అనే శీర్షికతో జరిగిన ఈ ఉపన్యాసం, లైంగిక హింస యొక్క నిరంతర ముప్పు కారణంగా మహిళలు మోస్తున్న, విస్తృతంగా వ్యాపించి ఉన్న, తరచుగా విస్మరించబడే మానసిక భారాన్ని పరిశీలించింది. ఈ భయం వారి మానసిక ఆరోగ్యాన్ని, ప్రవర్తనను, రోజువారీ నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తుందో డాక్టర్ వసీం వివరించారు. అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 'అనాలిసిస్ ఆఫ్ సోషల్ ఇష్యూస్ అండ్ పబ్లిక్ పాలసీ' (వైలీ) జర్నల్ లో ప్రచురితమైన ఆమె పరిశోధన, అందులోని ప్రధాన అంశాలను డాక్టర్ వసీం వివరించారు. అనుభవపూర్వక పరిశోధనల ఆధారంగా,



సమాజంలో లోతుగా పాతుకుపోయిన, ఈ సవాళ్లను పరిష్కరించడానికి మరింత అవగాహన, విధానపరమైన జోక్యం, బలమైన సహాయక వ్యవస్థల ఆవశ్యకతను ఆమె నొక్కి చెప్పారు.భయం యొక్క పటం'గా వర్ణించిన ఆరు కీలక అంశాలను డాక్టర్ వసీం సమర్పించారు. బహిరంగ ప్రదేశాలలో నిరంతర అతి జాగరూకత, మారిన జీవన విధానాలు పరిమితమైన చలనశీలత, మహిళలు అవలంబించే సర్దుబాటు పద్ధతులు, ఆందోళనభావోద్వేగ అలసట వంటి మానసిక ప్రభావాలు, రక్షణ పేరుతో కుటుంబం విధించే ఆంక్షలు, వ్యవస్థాగత మార్పు కోసం పెరుగుతున్న డిమాండ్లతో పాటు శారీరక హింస లేకపోయినా, భయమే నిజమైన హానిని కలిగించగలదని ఆమె అభిప్రాయపడ్డారు. అర్థవంతమైన సంస్కరణల కోసం పిలుపునిస్తూ, సకాలంలో న్యాయం, బలమైన చట్ట అమలు, సహాయక కుటుంబ వాతావరణం, బాధితులను నిందించే వైఖరులను సవాలు చేసే సాంస్కృతిక మార్పు యొక్క ఆవశ్యకతను డాక్టర్ వసీం నొక్కి చెప్పారు. న్యాయమైన సమాజానికి మహిళల భద్రతను నిర్ధారించడం ప్రాథమికమని స్పష్టీకరిస్తూ, ఆమె తన ఉపన్యాసాన్ని ముగించారు. జీఎస్ హెచ్ఎస్ సంస్థాగత పరిశోధన కమిటీ నిర్వహించిన ఈ చర్చాగోష్ఠిలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. సమకాలీన భారతదేశంలో లింగం, భద్రత, మానసిక శ్రేయస్సుపై విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహిస్తూ, ఆసక్తికరమైన చర్చతో ఈ సమావేశం ముగిసింది.



## శాంతినగర్‌లో బోరు సమస్యకు తక్షణ పరిష్కారం

– **మున్సిపల్ వైస్ చైర్మన్ షోయబ్ హుస్సేన్ స్పందన.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(భారత శక్తి): ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ కాలనీలో చెడిపోయిన బోరు సమస్యను మున్సిపల్ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్ తక్షణమే పరిష్కరించారు. గత కొన్ని రోజులుగా బోరు పనిచేయకపోవడంతో కాలనీవాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న వెంటనే వైస్ చైర్మన్ స్పందించి, సంబంధిత మున్సిపల్ సిబ్బందిని అప్రమత్తం చేసి బోరు రిపేర్ పనులను ప్రారంభింపజేశారు. సిబ్బంది త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేయడంతో బోరు మళ్లీ వినియోగంలోకి వచ్చింది. తక్షణ చర్యలు తీసుకుని ప్రజల సమస్యను పరిష్కరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్‌కు మరియు సహకరించిన మున్సిపల్ సిబ్బందికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ ఐకాప్స్ నిర్వహణకు సీబీసీ టెండరు

విజయవాడ, ఏప్రిల్ 23(భారత శక్తి ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రధాన పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ఇతివృత్త ఆధార అంశాల మీద సమీకృత సమాచార మరియు ప్రచార కార్యక్రమం (ఐకాప్ ) నిర్వహించడానికి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి ) టెండర్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ఈవెంట్ మేనేజ్ మెంట్ సంస్థల నుంచి కొటేషన్లను మే నెల 5వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్టు సీబీసీ డైరెక్టర్ జి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సీబీసీ ప్రకటించిన ఎంపానెల్ మెంట్ వివరాలు, టెండర్ ప్రక్రియలో పాల్గొనే సంస్థలకు కావలసిన అర్హతలు, ఇతర నిబంధనలను https://eprocure.gov.in/epublish/app లో టెండర్ ఐడి 835410_2 ద్వారా లేదా https://cbcindia.gov.in/ పోర్టల్ లో ప్రచురించిన టెండర్ నోటీసులో కూడా పొందవచ్చని ఆయన తెలిపారు. ఎంపానెల్ మెంట్ ద్వారా ఎంపికైన సంస్థలు ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రచార కార్యక్రమాలు, ప్రదర్శనలు, సదస్సులు నిర్వహించవలసి ఉంటుందని శ్రీ సురేష్ కుమార్ తెలిపారు. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల కింద నమోదైన సంస్థలకు నిబద్ధత సొమ్ము (ఇఎండి ) నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు. కనిష్ఠ ధర పలికిన సంస్థకు ఇచ్చే అరవై శాతం పనులు పోను, టెండరు ప్రక్రియలో విజయవంతంగా పాల్గొన్న సంస్థలన్నింటికీ మిగిలిన పనిని సమానంగా చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. సంస్థల పనితీరును బట్టి, పరస్పర అంగీకారంపై ఎంపానెల్ మెంట్ మరో ఏడాది పొడిగించే అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. ఈనెల 30వ తేదీన ప్రీబిడ్ సమావేశం నిర్వహించి టెండర్ ప్రక్రియలో పాల్గొనే సంస్థలకు ఐకాప్ కార్యక్రమాల వివరాలు, సంస్థల బాధ్యతలను వివరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో నమోదైన, ఆసక్తిగల సంస్థలు టెండరు ప్రక్రియలో పాల్గొనాలని సురేష్ కుమార్ విజ్ఞప్తి చేసారు.




## ఆర్టీసీ కార్మికుల సమ్మె కు మద్దతు గా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్

* **కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23(భారత శక్తి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు గత రెండు రోజులుగా చేస్తున్న కార్మికులకు గురువారం రోజున మంచిర్యాల డిపోలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మద్దుతు తెలిపి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఆర్టీసీ కార్మికులకు అమలు చేసే వరకు బీజేపీ పోరాటం చేస్తూ కార్మికులకు అండగా ఉంటుందని రఘునాథ్ తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు పెండింగ్ లో ఉన్న రెండు పీఆర్సీ లు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్ కుమార్, కార్పొరేటర్ కస్తూరి నాగరాజు, కర్రె లచ్చన్న, మెరెడికొండ శ్రీనివాస్, అశోక్, పవన్, మణికాంత్, తదితరులు పాల్గొన్నారు.

## జలదార కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టండి



: **జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**

వైయస్సార్ కడప జిల్లా, ఏప్రిల్ 23(భారత శక్తి ): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జలదార కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి జలాధార అమలు, 22ఏ, రీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, డిజిటల్ రెవెన్యూ రిజిస్ట్రీ, స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షన్,తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల కార్యదర్శులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ డా. నిధి మీనా, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జలదార కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఎటువంటి లోపాలు లేకుండా డ్వామా, జల వనరుల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమ నిర్వహణలో మండల, గ్రామ స్థాయి అధికారులు నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళికను తూచా తప్పకుండా అమలు చేయాలని సూచిస్తూ, బాధ్యతాయుతమైన పనితీరును కనబరచాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంచార్జి డిఆర్వో.వెంకటపతి, సీపీవో హజరతయ్య, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్ సమీ, డ్వామా పీడి అదిశేషారెడ్డి, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏడుకొండలు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మె.. మంత్రుల కమిటీ వేసే యోచనలో ప్రభుత్వం

- కొనసాగుతున్న తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె
- సీఎం, డిప్యూటీ సీఎంలతో పొన్నం, వివేక్ చర్చలు
- కాసేపట్లో భేటీ కానున్న కేబినెట్

హైదరాబాద్, ఏప్రిల్ 23(భారతశక్తి): ఆర్టీసీ కార్మికుల సమ్మె సెగ సచివాలయాన్ని తాకడంతో ప్రభుత్వం వేగంగా స్పందించింది. నిన్న రాత్రి రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలతో భేటీ అయ్యి తాజా పరిస్థితులపై చర్చించారు. కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లలో ఇప్పటికే 29 అంశాలకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా వేతన సవరణ (30 శాతం ఫిట్‌మెంట్), పెండింగ్ బకాయిలు, విలీనం



వంటి కీలక అంశాలపై ఐఏఎస్ అధికారుల కమిటీ ఇచ్చిన ప్రాథమిక నివేదికను నేడు కేబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. ఈ కేబినెట్ భేటీ అనంతరం సమస్యల పరిష్కారానికి ఒక మంత్రుల కమిటీని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఈ కమిటీ కార్మిక సంఘాలతో నేరుగా చర్చలు జరిపి సమ్మె విరమింపజేసేలా వ్యూహం రచిస్తుంది.

## తెలంగాణ రాష్ట్ర పండుగగా వాసవీ మాత జయంతి... ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఏప్రిల్ 23(భారతశక్తి): తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీ వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించింది. ఇకపై ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ లాంఛనాలతో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న వాసవీ జయంతి రానుండటంతో, ఆ రోజున ఉత్సవాలు జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు బుధవారం G.O. Ms. No. 67ను జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో వాసవీ మాత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ఉత్సవాల నిర్వహణ బాధ్యతలను యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖకు నోడల్ ఏజెన్సీగా అప్పగించారు. వేడుకలకు అవసరమైన నిధులను ఆ శాఖ బడ్జెట్ నుంచే కేటాయించాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో వాసవీ మాత జయంతి ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా జరగనున్నాయి.

## తమిళనాడు, బెంగాల్లలో రికార్డు స్థాయిలో పోలింగ్!

చెన్నై/కోల్‌కతా, ఏప్రిల్ 23 (భారతశక్తి): :తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇవాళ తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగ్గా, పశ్చిమ బెంగాల్ లో 152 స్థానాల్లో తొలి విడత పోలింగ్ నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ప్రజలు, తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భారీ ఉత్సాహం ప్రదర్శించారు. ఎన్నికల సంఘం అంచనాల ప్రకారం, సాయంత్రం 5 గంటలకే పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం, తమిళనాడులో 82.24 శాతం పోలింగ్ నమోదైంది. ఇది 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 82 శాతం, 74 శాతం కంటే గణనీయంగా అధికం కావడం గమనార్హం. ఎన్నికలకు ముందు తీవ్ర వివాదానికి దారితీసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డ్రైవ్ ప్రభావం ఏమాత్రం కనిపించకపోగా, పోలింగ్ శాతం ఊహించని స్థాయికి చేరడం విశేషం. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ, నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే), తమిళగ వెట్రి కళగం (టీవీకే) మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. చెన్నైలో పోలింగ్ చివరి గంటలో, ఓటర్లు తమ హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. ఏఐఏడీఎంకే అభ్యర్థి డి. జయకుమార్, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ వంటి ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. ఈ ఎన్నికల్లో కన్యాకుమారి జిల్లాలో ప్రజాస్వామ్య స్ఫూర్తి వెల్లివిరిసింది. రోడ్డు సౌకర్యం లేని మారుమూల కొండ ప్రాంతాలకు చెందిన 'కని' గిరిజన తెగ ప్రజలు, పెచిపారై డ్యామ్‌లో పడవలపై ప్రయాణించి వచ్చి మరీ ఓటు వేశారు. డ్యామ్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో, జిల్లా యంత్రాంగం లైఫ్ జాకెట్లతో కూడిన మూడు ప్రత్యేక పడవలను ఏర్పాటు చేసి వారిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు తరలించింది. మరోవైపు, డీఎంకే కూటమి 200కు పైగా స్థానాల్లో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని ఎండీఎంకే నేత వైగో ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, పశ్చిమ బెంగాల్‌లో తొలి విడతలో భాగంగా 16 జిల్లాల పరిధిలోని 152 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉత్తర బెంగాల్‌లోని కూచ్ బెహార్, డార్జిలింగ్, జల్‌పాయ్‌గురి, దక్షిణ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, పురులియా, బంకురా వంటి జిల్లాల్లో ఓటర్లు భారీగా తరలివచ్చారు. మిగిలిన 142 నియోజకవర్గాలకు రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టి, ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఫలితాలు రెండు రాష్ట్రాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## రేపటి నుంచే స్కూళ్లకు వేసవి సెలవులు

తెలంగాణ, ఏప్రిల్ 23(భారతశక్తి): విద్యార్థులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వేసవి సెలవుల సందడి తెలంగాణలో మొదలైంది. రేపటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, నేడు (ఏప్రిల్ 23) విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలన్నీ వేసవి సెలవుల కారణంగా మూతపడనున్నాయి.

**సమ్మర్ హాలిడేస్ షెడ్యూల్:**

ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు మొత్తం 50 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు ఉండనున్నాయి. జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు జరిగేవి, కానీ ఈ ఏడాది ఎండలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ముందస్తుగానే సెలవులు ప్రకటించింది.

## హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తత 14 భారత నౌకలు సురక్షితం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (భారతశక్తి): హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, గత కొన్ని వారాల్లో 14 భారత నౌకలు ఆ ప్రాంతం నుంచి సురక్షితంగా బయటపడ్డాయని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. అయితే, మరో 14 నౌకలు ఇంకా పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయని తెలిపింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గురువారం న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో, ప్రపంచ చమురు వాణిజ్యంలో ఐదో వంతు జరిగే హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటించిన కొన్ని గంటల్లోనే, భారత్‌లోని ముంద్రా పోర్టుకు వస్తున్న 'ఎపామినోడాస్' అనే నౌకపై ఇరాన్ దాడి చేసింది. లైబీరియా జెండాతో ఉన్న ఈ నౌకతో పాటు మరో షిప్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్టు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది. అంతకుముందు గత శనివారం కూడా, అనుమతి పొందిన రెండు భారత నౌకలపై ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫతాలీని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పిలిపించి మాట్లాడారు. భారత నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కాల్పులు జరపడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య నౌకల భద్రతకు భారత్ ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. గతంలో భారత్‌కు వచ్చే నౌకలకు ఇరాన్ సురక్షిత మార్గాన్ని కల్పించిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నౌకల రాకపోకలను తిరిగి సులభతరం చేయాలని కోరినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

## బెంగాల్ జోరు.. మోదీ హుషారు!

మధురాపూర్ (పశ్చిమ బెంగాల్), ఏప్రిల్ 23(భారతశక్తి): పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా దండెత్తింది బీజేపీ కాదని... రాష్ట్రంలోని మహిళలు, యువతే చురుకైన పోరాటాన్ని ప్రారంభించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గురువారం 152 నియోజకవర్గాల్లో జరిగిన తొలిదశ అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన అధిక ఓటింగ్ శాతమే దీనికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. బెంగాల్ లో సాయంత్రం 5 గంటల సమయానికి 89.93 శాతం ఓటింగ్ నమోదైంది. రెండో దశ ఎన్నికలు ఏప్రిల్ 29న జరగనున్న నేపథ్యంలో, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మధురాపూర్‌లో నిర్వహించిన ప్రచార సభలో ప్రధాని మాట్లాడారు. తీవ్రమైన ఎండను కూడా లెక్కచేయకుండా ఓటర్లు పోటెత్తడం చూస్తుంటే, మే 4వ తేదీ కేవలం ఫలితాల రోజు మాత్రమే కాదని, పశ్చిమ బెంగాల్‌లో మార్పునకు నాంది పలికే రోజని రుజువు చేస్తోందని మోదీ పేర్కొన్నారు. "ఈరోజు ఓటర్లలో కనిపించిన ఉత్సాహం, ముఖ్యంగా మహిళలు, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువతలో కనిపించిన ఆసక్తి, తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిజమైన పోరాటాన్ని ప్రారంభించింది వారేనని నిరూపించింది" అని ఆయన వివరించారు. ఇటీవల లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ చట్ట సవరణను అడ్డుకోవడంలో తృణమూల్ కాంగ్రెస్ పోషించిన పాత్రతో ఆ పార్టీ అసలు స్వరూపం రాష్ట్రంలోని మహిళలకు అర్థమైందని మోదీ అన్నారు. "లోక్‌సభలో జరిగిన పరిణామాలతో తృణమూల్, ఇతర ప్రతిపక్ష పార్టీల మహిళా వ్యతిరేక వైఖరి బయటపడింది. అందుకే ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్పాలని బెంగాల్ మహిళలు నిర్ణయించుకున్నారు. మహిళా సాధికారతకు అడ్డంకిగా నిలిచినందుకు ఈసారి తృణమూల్‌ను వారు కచ్చితంగా శిక్షిస్తారు. బెంగాల్ కాళీమాత, దుర్గామాత వెలసిన నేల. కానీ తృణమూల్ పాలనలో ఇక్కడ మహిళలకు భద్రత లేదు. కాబట్టి మీ ఓటు అన్నింటినీ మారుస్తుంది. ఇకపై అన్యాయాన్ని సహించవద్దు" అని ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు మే 4వ తేదీ గడువు తేదీ అవుతుందని మోదీ జోస్యం చెప్పారు. అవినీతి, దోపిడీ, హింస, మహిళలపై నేరాలతో నిండిన చీకటి రోజులు ఆ రోజుతో ముగిసిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత, అక్రమ చొరబాట్ల విషయంలో శూన్య సహన విధానాన్ని అవలంబిస్తామని స్పష్టం చేశారు. "దక్షిణ 24 పరగణాల జిల్లాలో స్థానిక మత్స్యకారుల హక్కుల వాటాను అక్రమ చొరబాటుదారులు లాక్కుంటున్నారు. కానీ తృణమూల్ కాంగ్రెస్ మాత్రం తమ ఓట్ల కోసం అక్రమ చొరబాట్లను కొనసాగించాలని కోరుకుంటోంది. అక్రమ చొరబాటుదారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నా తృణమూల్ వ్యతిరేకిస్తోంది" అని ప్రధాని ఆరోపించారు.

## చంద్రబాబు హెచ్చరిక: 'శుభ దినాల్లోనూ తప్పడు పనులే'

అనకాపల్లి, ఏప్రిల్ 23(భారతశక్తి): అనకాపల్లిలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఒక పార్టీ నేరాలు, ఘోరాలు చేస్తూ అరాచకాలకు పాల్పడుతోందని, అలాంటి కిల్లర్ పార్టీ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మంచి కార్యక్రమాలు, శుభ దినాల్లో కూడా ఇలాంటి దుర్మార్గులను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని, వారి గురించి ప్రజలను అప్రమత్తం చేయాల్సి వస్తోందని ఆయన అన్నారు.అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో గురువారం రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థకు చెందిన రెండు ప్లాంట్లకు భూమిపూజ చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వ తీరును, ప్రతిపక్ష నేతల వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు.

**హత్యలు చేసే కిల్లర్ పార్టీ అది**

"డబ్బు కోసం, ఆస్తుల కోసం సొంత మనుషుల్ని సైతం కడతేర్చే కిల్లర్ పార్టీ అది. వివేకా హత్య తరహాలోనే కడపలో దస్తగిరి అనే వ్యక్తిని హత్య చేశారు. జగన్ మోహన్ రెడ్డి మేనమామకు ప్రధాన అనుచరుడు, ఆస్తుల కోసం పెద్ద దస్తగిరిని చంపేశాడు. డ్రైవర్‌ను హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని ఎమ్మెల్సీగా చేశారు. ఇప్పుడు అతనే సాక్షుల్ని బెదిరించే స్థాయికి వచ్చాడు. ఇలాంటి మోసగాళ్లపై మేం నిరంతరం కన్నేసి ఉంచుతాం. అధికారంలోకి వస్తే నరికేస్తాం, చంపేస్తాం, పెట్టుబడి దారులను తరిమేస్తాం అని బెదిరించే పార్టీలు మనకెందుకు? రాష్ట్రంలో మంచి జరుగుతుంటే ఆ కిల్లర్ పార్టీకి ఫ్రస్ట్రేషన్ పెరిగిపోతోంది. నాడు ఉత్తరాంధ్రలో ప్రొక్లయినర్లతో కూల్చివేతలు జరిగేవి. నేడు అవే ప్రొక్లయినర్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ప్రకృతి వనరులు దోచిన పాలకులకు, వాటిని సంపదగా మార్చే ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనించాలి" అని చంద్రబాబు అన్నారు.

*** ఉత్తరాంధ్రలో ఇక ప్రతిరోజూ పెట్టుబడుల పండుగే!**

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జెడ్ చింతువలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న రెండు ప్లాంట్లకు సీఎం చంద్రబాబు భూమిపూజ చేశారు. రూ.4,200 కోట్లతో 6.5 గిగావాట్ల సోలార్ ఇంగాట్ వేఫర్ తయారీ యూనిట్, రూ.1200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 2,100 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, "ఉత్తరాంధ్రలో ప్రతిరోజూ పెట్టుబడుల పండుగే. అనకాపల్లి జిల్లా పెట్టుబడులతో అభివృద్ధిని ఆకర్షిస్తోంది. విశాఖ సమీపంలోని అనకాపల్లి మరో రంగారెడ్డి జిల్లాగా తయారవుతుంది. ఎన్డీఏ బ్రాండ్‌తో ఏపీలో తిరిగి విశ్వాసం వచ్చింది. పారిశ్రామికవేత్తలకు భరోసా కలిగింది. ఈ నెల 28న 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం," అని వెల్లడించారు.

**రెన్యూవబుల్ ఎనర్జీతో జాతి నిర్మాణం**

రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించడమే కాకుండా, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తితో జాతి నిర్మాణానికి పాటుపడుతున్నామని చంద్రబాబు తెలిపారు. "ఏపీలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంటే, ఇప్పటికే 90 గిగావాట్ల పనులు ప్రారంభమయ్యాయి.

## ఇక పెట్రో మంట ఉండదు: కేంద్రం కీలక ప్రకటన

ఢిల్లీ, ఏప్రిల్ 23(భారతశక్తి): పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ వస్తున్న మీడియా కథనాలపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వార్తలను 'దురుద్దేశపూర్వకమైనవి, తప్పుదోవ పట్టించేవి'గా అభివర్ణిస్తూ కొట్టిపారేసింది. ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వ పరిశీలనలో ఎలాంటి ప్రతిపాదన లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది. ప్రజలలో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. "గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, ఆ ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిరంతరం చర్యలు తీసుకున్నాయి" అని వివరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో ధరలు స్థిరంగానే ఉన్నాయని గుర్తుచేసింది.

*** దేశంలో సాధారణంగానే ఎల్పీజీ సిలిండర్ల సరఫరా**

ఇదే సమయంలో దేశంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా సాధారణంగా ఉందని, ఎక్కడా కొరత లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. మరోవైపు అమెరికా ఇరాన్ శాంతి చర్చలు నిలిచిపోవడంతో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 103 డాలర్లు దాటగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ ధర 94 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది.

## టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం: బ్యాంకులకు సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 23(భారతశక్తి): సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని, 'జీరో మ్యూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన 75 మంది సీనియర్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి దోచుకున్న డబ్బును మళ్లించేందుకు వాడే 'మ్యూల్ అకౌంట్ల'ను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఇటీవల హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో భాగంగా మ్యూల్ అకౌంట్లు తెరిచేందుకు కొందరు బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ బ్యాంకు అధికారులతో నేరుగా మాట్లాడారు. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ & సిట్) ఎం. శ్రీనివాసులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ... "బ్యాంకు బ్రాంచ్‌లు కొత్త ఖాతాలు తెరిచే టార్గెట్లపై కాకుండా, పౌరుల భద్రత, సంస్థాగత సమగ్రతపై దృష్టి పెట్టాలి. దీనికోసం 'ట్విన్‌ఛాలెంజ్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. 'జీరో సైబర్ క్రైమ్ బాధితులు', 'జీరో మ్యూల్ అకౌంట్లు' అనే అంశాలను బ్రాంచ్‌ల పనితీరుకు కొలమానంగా (KPIs) తీసుకోవాలి. ఖాతాల సంఖ్యను పనితీరుకు ప్రామాణికంగా చూడొద్దు" అని సూచించారు. సైబర్ మోసాలకు సంబంధించి తమ సంస్థలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటించాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి జాతీయ హెల్ప్‌లైన్ (1930), సైబర్‌క్రైమ్ పోర్టల్ (cybercrime.gov.in) గురించి తెలియజేయాలని ఆదేశించారు. మోసపూరిత ఖాతాలు తెరవడంలో పాలుపంచుకున్న కేవైసీ వెరిఫైయర్లపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, అలాంటి ఉద్యోగులను బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం నుంచే బ్లాక్‌లిస్ట్ చేయాలని అన్నారు. 'మ్యూల్ హంటర్' వంటి అధునాతన టెక్నాలజీని ఉపయోగించి మోసాలను గుర్తించాలని సూచించారు. కంబోడియా, వియత్నాం, యూఏఈ వంటి దేశాల నుంచి సైబర్ ముఠాలు పనిచేస్తున్నాయని, అవి భారతీయ మధ్యవర్తుల ద్వారా బ్యాంకు అధికారులతో కుమ్మక్కై మ్యూల్ అకౌంట్లను తెరిచి, నిధులను తరలిస్తున్నాయని సజ్జనార్ వివరించారు. ఈ నెట్‌వర్క్‌లను ఛేదించడంలో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

# బడంగ్‌పేట్ 'అవినీతి బాగోతం'.. సర్కారుకు సబితమ్మ సెటైర్లు!

- పది మంది సస్పెన్షన్ కేవలం 'ఐవాష్' మాత్రమేనా?
- బహిరంగ లేఖతో రేవంత్ సర్కారుకు 'మహేశ్వరం' సెగ.. బయటపడనున్న 'అదృశ్య' హస్తాల బాగోతం
- గుట్టలు, చెరువులు, గ్రీన్ జోన్ ప్రభుత్వ భూముల కబ్జాలపై ఆరా..!

హైదరాబాద్ ఏప్రిల్ 23 (భారతశక్తి): బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో తిష్టవేసిన అవినీతి తిమింగలాలపై స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి యుద్ధం ప్రకటించారు. పది మంది కింది స్థాయి అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం కాదని, అసలు సూత్రధారులను పట్టుకోవాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కలెక్టర్, మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీలకు రాసిన బహిరంగ లేఖ ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న విచారణలు కేవలం నామమాత్రంగానే సాగుతున్నాయన్న చురకలు ఈ లేఖలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

**'మంచుకొండ కొన' మాత్రమేనా?**

బడంగ్‌పేట్‌లో 10 మంది అధికారుల సస్పెన్షన్ కేవలం కంటితుడుపు చర్యేనని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. ఆమె సంధించిన లేఖలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే, అక్కడ సాగుతున్న వ్యవస్థీకృత అవినీతి లోతు ఎంత ఉందో అర్థమవుతోంది:

* అధికారిక అండదండలు: కేవలం అధికారులే ఇంతటి భారీ అక్రమాలకు పాల్పడలేరని, వారి వెనుక బలమైన 'రాజకీయ శక్తులు' ఉన్నాయని సబితా నేరుగా ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో ఈ 'అదృశ్య శక్తుల'పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆమె ప్రశ్నించడం ఇప్పుడు ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది.
* ఆధారాలు మాయం: విచారణ జరుగుతుండగానే మున్సిపల్ కార్యాలయం నుంచి కీలక దస్త్రాలు మాయం కావడం వెనుక ఉన్న పెద్ద తలకాయలు ఎవరివి? ఫైళ్లు మాయమైతే క్రిమినల్ కేసులు ఎందుకు నమోదు చేయలేదన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.




*** చెరువుల విధ్వంసం.. రియల్ మాఫియా పండగ**

బడంగ్‌పేట్ పరిధిలో జల వనరుల విధ్వంసం భయంకరంగా ఉంది.

1. ఎఫ్‌టీఎల్ మ్యాపింగ్ ఎక్కడ?:బడంగ్‌పేట్ చుట్టుపక్కల ఉన్న చెరువులకు ఇప్పటివరకు ఎఫ్‌టీఎల్ (FTL) ఖరారు చేయకపోవడం వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాలు దాగి ఉన్నాయి.
2. నాళాల ఆక్రమణ: వరద నీరు వెళ్లే సహజ సిద్ధమైన నాళాలను పూడ్చివేసి వెంచర్లు వేశారు. వీటిపై చర్యలు తీసుకోకుండా కేవలం నోటీసులతో కాలయాపన చేయడం వెనుక ఉన్న అంతర్యమేమిటని లేఖలో నిలదీశారు.

**ఒకే ప్లాటు.. పది అనుమతులు!**


భవన నిర్మాణ అనుమతుల్లో జరుగుతున్న దారుణాలు విస్తుగొలుపుతున్నాయి. ఒకే ప్లాటుపై 10 వరకు అనుమతులు ఇవ్వడం అనేది సాంకేతికంగా అసంభవం. కానీ బడంగ్‌పేట్‌లో ఇది సాధ్యమైంది.

*సాంకేతిక ఆధారాలు: మున్సిపల్ సాఫ్ట్‌వేర్ "బిల్ట్ నౌ" (TSbPASS) నిబంధనలను పక్కన పెట్టి, మాన్యువల్‌గా లేదా పాత తేదీలతో అనుమతులు మంజూరు చేసినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారంలో ఉన్నత స్థాయి కమిటీ విచారణ జరిగితే తప్ప అసలు నిధుల దోపిడీ బయటపడదు.

**ప్రభుత్వానికి 'సబితా ఇంద్రారెడ్డి' సవాల్**

"ప్రజాధనం దుర్వినియోగం అవుతుంటే ప్రభుత్వం నిష్పక్షపాతంగా ఎందుకు వ్యవహరించడం లేదు?" అన్నదే సబితా ఇంద్రారెడ్డి ప్రధాన ప్రశ్న.

* రికవరీ ఫార్ములా: అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టడంతో పాటు, వారు కాజేసిన సొమ్మును రికవరీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.
* రాజకీయ చురకలు: పాలనలో మార్పు అంటే కేవలం బదిలీలు, సస్పెన్షన్లు కాదని.. వ్యవస్థలో వేళ్లూనుకున్న అవినీతిని పెకిలించడమేనని ఆమె తన లేఖ ద్వారా కాంగ్రెస్ సర్కారుకు గట్టి సందేశం పంపారు.
* మహేశ్వరం నియోజకవర్గ ప్రతినిధిగా సబితా ఇంద్రారెడ్డి చేసిన ఈ బహిరంగ ఫిర్యాదుతో ఇప్పుడు బంతి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోర్టులో ఉంది. మరి ఈ 'పెద్దల' అక్రమాలపై ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో వేచి చూడాలి.




Smt. P. SABITHA INDRA REDDY
MLA
Ex Minister for Education
Maheshwaram Constituency - 50
Ranga Reddy District. TG.
Ph : 040-23757108
E-mail : sabithaindrareddi@gmail.com

+విచారణ జరిపించాలి. గతంలో నగర పంచాయతీలుగా ఉన్న సమయం నుండి కార్పొరేషన్ ఉన్నత వరకు మాజీ సర్పంచ్‌ల తీర్మానాల పేరుతో అడ్డగోలుగా చేసిన లేఅవుట్లపై ప్రత్యేక దృష్టి సారించాలి, నిబంధనలకు విరుద్ధంగా LRS కట్టించుకున్న వాటిపై విచారణ చేయండి.

- ప్రజాధనం రికవరీ - కాంట్రాక్టర్ల బ్లాక్ లిస్ట్: పనులు పూర్తి చేయకుండా బిల్లులు డ్రా చేసిన పనుల వివరాలను బహిర్గతం చేయాలి, సదరు కాంట్రాక్టర్స్ నుండి ఆ సొమ్మును రికవరీ చేయాలి.
- అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్లను తక్షణమే "బ్లాకు లిస్టు"లో చేర్చాలి.
- ప్రభుత్వ నిధులు ప్రైవేట్ వెంచర్లలో చేసిన పనుల నిధులు వారి నుండి రికవరీ చేసి, కాంక్రీట్ అయి పనులు కాకపోతే, కాన్సిల్ చేసి ఆ వెంచర్ ఓనర్స్ పై కేసు నమోదు చేయాలి
- ఫైళ్ల మాయం - క్రిమినల్ కేసులు: మున్సిపల్ కార్యాలయంలో ఉండాల్సిన కీలకమైన ఫైళ్లను ఉద్దేశపూర్వకంగా మాయం చేసిన సూత్రధారులను గుర్తించి, వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.
- చెరువుల సుందరీకరణ విషయములో కూడా విచారణ చేయండి
- అవినీతి సూత్ర నధారులపై చర్యలు: కేవలం కింది స్థాయి అధికారులనే కాకుండా, వారి వెనుక ఉండి ఈ భారీ అక్రమాలను ప్రోత్సహించిన మరియు అందులో లబ్ధి పొందిన అదృశ్య శక్తులను విచారణ పరిధిలోకి తీసుకురావాలి.
- ప్రభుత్వ నిధులను, భూములను కాపాడటంలో ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతున్నాను. ఈ అక్రమాలపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ జరిపించి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు మరియు ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నాను.

కాపీ టూ: GHMC కమీషనర్.

ధన్యవాదాలతో,
పి. సబితా ఇంద్రారెడ్డి.



Smt. P. SABITHA INDRA REDDY
MLA
Ex Minister for Education
Maheshwaram Constituency - 50
Ranga Reddy District. TG.
Ph : 040-23757108
E-mail : sabithaindrareddi@gmail.com

OFFICE OF THE CHIEF MINISTER 23 APR 2026 Govt. of Telangana

Date : 23-04-2026
స్థలం: హైదరాబాద్

గౌరవనీయులైన శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి,
ముఖ్యమంత్రి, తెలంగాణ రాష్ట్రం.

విషయం: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో (ప్రస్తుతం GHMC పరిధిలోని బడంగ్ పేట్ సర్కిల్) జరిగిన భారీ అవినీతి మరియు అక్రమాలపై సమగ్ర విచారణ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ...

గౌరవనీయ ముఖ్యమంత్రి గారికి,

- బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన నిధుల దుర్వినియోగం మరియు అవినీతి అక్రమాలకు బాధ్యులను చేస్తూ 10 మంది అధికారులను సస్పెండ్ చేయడాన్ని మేము హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నాము. అయితే, వెలుగులోకి వచ్చిన ప్రాథమిక విచారణాంశాలను పరిశీలిస్తే, ఇది కేవలం 'మంచుకొండ కొన' (Tip of the iceberg) మాత్రమేనని స్పష్టమవుతోంది. ఇక్కడ సాగిన వ్యవస్థీకృత అవినీతిని కూకటివేళ్లతో సహా పెకిలించాలంటే మరింత లోతైన విచారణ అవసరమని మీ దృష్టికి తీసుకువస్తున్నాను.
- ప్రజల సొమ్మును కాజేస్తూ, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న వారిపై ఈ క్రింది అంశాలపై తక్షణమే ప్రత్యేక విచారణ (Special Inquiry) జరిపించాలని కోరుతున్నాను:
- జల వనరుల పరిరక్షణ - FTL ఆక్రమణలు: బడంగపేట పరిధిలోని చెరువులు, కుంటలకు తక్షణమే FTL (Full Tank Level) మరియు బఫర్ జోన్లను నిర్ణయించి, ఆ వివరాలను బహిర్గతం చేయాలి. నాళాలను కబ్జా చేసి అక్రమంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసిన వారిపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలి, నాలాలను పునరుద్ధించాలి.
- భవన నిర్మాణ అనుమతుల్లో బరితెగింపు: నిబంధనలకు విరుద్ధంగా, ఒకే ప్లాట్‌పై ఏకంగా పది వరకు ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేసిన అధికారుల పాత్రపై



## రాహుల్ గాంధీని కలిసిన
# ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (భరతశక్తి) : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ గురువారం భేటీ అయ్యారు. ఢిల్లీలోని 10 జన్ పథ్ నివాసంలో రాహుల్‌ను ఆయన కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు పది నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో అనిల్‌కుమార్ యాదవ్ తన భార్య, పిల్లలను రాహుల్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా అనిల్ యాదవ్ పిల్లలతో రాహుల్ గాంధీ సరదాగా ముచ్చటించారు. వారి పేర్లు అడిగి తెలుసుకున్న ఆయన.. "మీ తాత, తండ్రి మాదిరిగానే మీరు కూడా భవిష్యత్తులో ప్రజాసేవలోకి వస్తారా?" అని ప్రశ్నించారు. ఎంపీ కుటుంబ సభ్యులతో రాహుల్ ఎంతో ఆత్మీయంగా గడిపారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

* పద్మనాభునిపల్లిలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా వార్షికోత్సవం
* హాజరైన జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి (DEO), ఎంఈఓ జోగు ప్రభుదాస్

సిద్దిపేట , ఏప్రిల్ 23(భారత శక్తి) : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ చరిత్రలో ఇదివరకు ఎప్పుడూ చూడని విధంగా ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ అధ్యక్షతన ఘనంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి (DEO), ఎంఈఓ జోగు ప్రభుదాస్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పద్మనాభునిపల్లిలో గతంలో సేవలందించిన పూర్వ ఉపాధ్యాయులు హాజరుకాగ అలాగే గ్రామ సర్పంచ్ వేముల అరుణ రాజేశం, తిమ్మాపూర్ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్, గ్రామ పాలకవర్గం,




మాజీ సర్పంచులు కండ్లకొయ్య పర్శరాములు, ముక్కపల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్ రుద్రారం యాదగిరి, యువజన సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా విద్యార్థులు ఆట పాటలు అందరిని తెగ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి (DEO), ఎంఈఓ జోగు ప్రభుదాస్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడానికి హెచ్ ఎం మల్లికార్జున్ చేస్తున్న సేవలకు గ్రామస్తుల సహకారం అందించడాన్ని తాము అభినందిస్తున్నమన్నారు. భవిష్యత్ లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని వారికీ ఇక్కడి యువత, పూర్వ విద్యార్థుల సహకారంతో పాటు గ్రామస్తులు సహకారం అందించాలని కోరారు. తదనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ మాట్లాడుతూ, "ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయడం తమ లక్ష్యమన్నారు. ఎందుకు గ్రామ ప్రజలు, యువజన సంఘాల సహకారం ఎంతో అవసరం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, తదితరులు ఉన్నారు.




# నిరాధార ఆరోపణలపై చర్యలు తీసుకోవాలి

* రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శివ కుమార్

సిద్దిపేట /గజ్వేల్, ఏప్రిల్ 23 (భారత శక్తి) : నిరాధార ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శివ కుమార్ అన్నారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శివకుమార్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్ రెడ్డి పై కొంతమంది వ్యక్తులు ప్రత్యేకించి మేడ్చల్ జిల్లా కొర్రెముల గ్రామ నివాసి శ్రీకాంత్ చేస్తున్న నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ ఆరోపణలు పూర్తిగా అసత్యమని, క్రీడా అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకుల ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ ప్రచారం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. మద్ది మహేందర్ రెడ్డి గారు కబడ్డీ క్రీడా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని, రాష్ట్రంలో క్రీడాకారులకు అనేక అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇలాంటి వ్యక్తిపై అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమని, ఇది క్రీడా వాతావరణాన్ని దెబ్బతీసే చర్య అని అన్నారు. అలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్న వ్యక్తిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. కబడ్డీ క్రీడను అభివృద్ధి చేయడంలో అసోసియేషన్ ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని, యు వ ప్రతిభా క్రీడాకారుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని శివ కుమార్ స్పష్టం చేశారు.

## శత్రువుకు దొరికినా తలవంచని
# వీరవనిత కామ్రేడ్ భాగ్యక్కకు కన్నీటి నివాళి

* ప్రజా గాయకురాలు విమలక్క

దుబ్బాక, ఏప్రిల్ 23 (భారత శక్తి) : ఇరవై నాలుగేళ్ల అజ్ఞాతవాసం…చిన్ననాటి పోలియోతో పోరాటం… చివరకు ఛత్తీస్‌గఢ్ అడవుల్లో తుపాకీ తూటాకు బలైన ధీర వనిత కామ్రేడ్ రంగబోయిన భాగ్య అలియాస్ రూపి సంస్మరణ సభ సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో భావోద్వేగ భరితంగా జరిగింది. ప్రజా గాయకురాలు విమలక్క పాల్గొన్న ఈ సభకు ప్రజా సంఘాల నాయకులు, వందలాది మంది హాజరై ఎర్రజెండాల మధ్య నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, "ఇది కేవలం సంస్మరణ సభ కాదు… ఒక పోరాట జీవితానికి ఇచ్చిన గౌరవ వందనం" అని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ కాంకేర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన భాగ్యక్క జీవితాన్ని స్మరించుకుంటూ ఆమె ధైర్యసాహసాలను గుర్తుచేశారు. అనంతరం






విమలక్క మాట్లాడుతూ.. "శత్రువుకు చిక్కినా లొంగిపోకుండా చివరి శ్వాస వరకు నమ్మిన మార్గంలో నడిచిన ధీర వనిత భాగ్యక్క" అని కొనియాడారు. ఆమె పోరాట జీవితం, అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం అడవి బాట పట్టిన భాగ్య జీవితం ప్రజల గుండెల్లో నిలిచిపోయిందని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో భాగ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కామ్రేడ్ భాగ్యక్క పాటల సీడీని ఆవిష్కరించారు. పోలియోను జయించి, 24 సంవత్సరాలు అజ్ఞాతంలో జీవించి, చివరి వరకు తన సిద్ధాంతాలకు కట్టుబడి నిలిచిన భాగ్య జీవిత గాథ సభలో పాల్గొన్న వారిని భావోద్వేగానికి గురి చేసింది.

# చిన్నారులకు నూతన వస్త్రాలంకరణ

* వైభవంగా వేడుక.. తరలివచ్చిన బంధుమిత్రులు

నల్గొండ , ఏప్రిల్ 23 భారతశక్తి: పుల్లెంల గ్రామానికి చెందిన కొడతం కిరణ్ కుమార్ రెడ్డి ప్రణతి దంపతుల కుమారుల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం కంచరకుంట్ల యాదగిరి రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో కిరణ్ కుమార్ రెడ్డి కుమారులు *విఘ్నేశ్వర్ రెడ్డి, యశ్వంత్ రెడ్డి* నూతన వస్త్రాలు ధరించి అతిథుల మధ్య సందడి చేశారు.

***శుభాకాంక్షలు తెలిపిన మిత్రబృందం**

ఈ వేడుకకు పెద్ద సంఖ్యలో బంధువులు, మిత్రులు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారిలో పంతంగి బిక్షం గౌడ్, బోయపల్లి వెంకట్ గౌడ్, అయితగోని ఆంజనేయులు గౌడ్, చెరుకు శ్రీశైలం గౌడ్, చెరకు



నాగరాజు గౌడ్, సుర శేఖర్, బొడ్డుపల్లి నర్సింహ, బొడ్డు శివ, పోలే మహేష్, ఇరిగి శివ, పెసర్ల హరీష్ తదితరులు ఉన్నారు. చిన్నారుల ఉజ్వల భవిష్యత్తును కోరుకుంటూ కుటుంబ సభ్యులకు మిత్రబృందం శుభాకాంక్షలు తెలియజేసింది.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.